J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 46 సంచిక : 17 25.9.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఎసరుతెచ్చిన ఎల్‌నినో..

# మండుతున్న ధరలు

- ఏపీలో భారీగా తగ్గిన వర్షపాతం
- పడిపోయిన వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి
- ఆకాశాన్నంటుతున్న బియ్యం, పప్పుధాన్యాలు
- గగ్గోలుపెడుతున్న సామాన్య, మధ్యతరగతి వర్గాలు



ప్రకృతి ప్రకోపిస్తే..మానవులు దూదిపింజాల్లా కొట్టుకెళ్తారనడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఇటీవల నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలే. ప్రళయ బీకరంగా ఎగసి పడిన జల ప్రవాహం అక్కడి నదీపరివాహక ప్రాంతాలను నామరూపాల్లేకుండా చేసింది. అయితే వరదలు, తుపానులు, సునామీలు వంటివి అకస్మాత్తుగా సంభవించి రెప్పపాటుకాలంలో ఊహించని నష్టాన్ని కలుగజేస్తే వర్షాభావం, కరువు వంటివి మాత్రం మెల్లమెల్లగా జనాన్ని కష్టాల ఊబిలో దింపి ఊపిరాడకుండా చేస్తాయి. సరిగ్గా ప్రస్తుతం ఇలాంటి పరిస్థితే ఆంధ్రప్రదేశ్‌లో కనిపిస్తోందంటే అతిశయోక్తి కాదు. ఎన్‌నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం సగానికిసగం పడిపోవడంతో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఫలితంగా నిత్యావసరాలు, రోజువారీగా ఉపయోగించే వస్తుసామాగ్రి ధరలు అమాంతం పెరిగి సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఎల్‌నినో కారణంగా కేవలం ఏపీలో ఎండలే కాదు, సరుకుల ధరలు సైతం అదేస్థాయిలో మండిపోతున్నాయి.

"అమ్మబోతే అడవి - కొనబోతే కొరివి" సాధారణంగా వ్యవసాయ ఉత్పత్తులు, నిత్యావసర వస్తువులకు సంబంధించి అటు రైతులు, ఇటు వినియోగదారులు తరచూ చెప్పేమాట ఇది. దీనికి ప్రధాన కారణం లాభార్జనే ధ్యేయంగా కలిగిన వ్యాపార, దళారి వర్గం. పెట్టుబడి పేరుతో అటు రైతుల శ్రమను, ఇటు వినియోగదారుడి కష్టాన్ని దోచుకోవడం వారికి వెన్నతోపెట్టిన విద్య. వీరి అత్యాశ ఫలితంగా అటు రోజువారీ వ్యవహారాల్లోనూ, ఇటు పండుగల వంటి ప్రత్యేక దినాల్లోనూ ధరాభారంతో ప్రజలు అల్లాడిపోవడం పరిపాటే. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎన్‌నినో అనే ప్రత్యేక వర్షాభావ పర్యావరణ స్థితి కారణంగా రుతుపవనాలు గతితప్పాయి. వరుణ దేవుడు శీతకన్నేశాడు. ఫలితంగా ఏటా నమోదయ్యే సగటు వర్షపాతంలో సగానికి సగం

2లో


శ్రద్ధాంజలి

"అజరామరం మీ స్ఫూర్తి
ఆచంద్రతారార్కం మీ కీర్తి"

స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి గారి సతీమణి

**శ్రీమతి మాగుంట పార్వతమ్మ గారు**

మాజీ పార్లమెంటు సభ్యురాలు, మాజీ శాసనసభ్యురాలు

ద్వితీయ వర్ధంతి సందర్భంగా

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

కుటుంబసభ్యులు
మరియు బంధుమిత్రులు



జననం : 27.07.1947 నిర్యాణం : 25.09.2024

# మండుతున్న ధరలు

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఈ ఏడాది నమోదయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ఇక సాగుచేసిన అరకొర పంటలు సైతం చేతికొచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో అన్నదాతలు ఏం చేయాలో దిక్కుతోచక అల్లాడిపోతున్నారు. ఇక రోజువారీ కూలీలు, శ్రామికవర్గం, మధ్యతరగతి వర్గం ప్రజలు నిత్యావసరాలు కొనుగోలు చేయలేని స్థితికి చేరిపోతున్నారు. ఫలితంగా పేదలు, వృద్ధులు, చిన్నారులు పౌష్టికాహారానికి దూరమై దుర్భరజీవనం గడపాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

## ధరలు ఆకాశంలో, ఆదాయం పాతాళంలో!

గ్రామీణ ప్రాంతాల్లో ఎల్‌నినో కారణంగా వర్షాలు పడకపోవడంతో వ్యవసాయ పనులు లేక పేదలు ఇంటికే పరిమితమవుతున్నారు. ఇక ప్రాజెక్టుల్లో నీటి మట్టం పడిపోవడం, భూగర్భజలాలు అడుగంటడం కారణంగా పరిస్థితి ఒక్కసారిగా దిగజారిపోయింది. దీంతో గతంలో ఎప్పుడూ లేనంతగా కూరగాయల నుంచి బియ్యం, ఉప్పు, పప్పు, వంటనూనెల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఇక పట్టణ, నగర ప్రాంతాల్లోనూ సరిగ్గా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. నెలవారీ అద్దెలు, కరెంటు బిల్లులు, స్కూల్ ఫీజులకు తోడు పట్టణ వాసులకు ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుల రూపంలో కొత్తకష్టం వచ్చిపడింది. ఫలితంగా నగరాలు, పట్టణాల్లో ప్రజల జీవన ప్రమాణస్థాయి క్రమంగా పడిపోతోంది. వారి కొనుగోలు శక్తి భారీగా తగ్గిపోతోంది. గతంతో పోలిస్తే బియ్యం ధరలు 20 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగాయి. ఇక పప్పుధాన్యాలు, వంటనూనెలు, వస్తుసామాగ్రి 30 శాతం నుంచి 50 శాతం వరకు అధికమైనట్లు కనిపిస్తోంది. 25 కేజీల బియ్యం బస్తా గతంలో రూ. 1200 నుంచి రూ. 1400 వరకు ఉండగా ప్రస్తుతం రూ.1800 నుంచి రూ. 2000 వరకు పలుకుతోంది. ఇక వంటనూనెల ధరలు గతంలో లీటరుకు రూ.120 నుంచి 140 వరకు ఉండగా ప్రస్తుతం రూ.180 నుంచి రూ.220 వరకు అమ్ముతున్నారు. ఆకుకూరలు, కూరగాయల సాగు విస్తీర్ణం అనూహ్యంగా పడిపోవడంతో ధరాభారం ఒక్కసారిగా రెట్టింపయ్యింది. మార్కెట్లకు వచ్చే వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా తగ్గిపోవడంతో టమోటాలు, ఉల్లిపాయలు, వంకాయలు, మునక్కాయలు, బెండకాయలు, మిరపకాయలు, చక్కెర, బెల్లం, అల్లం, వెల్లుల్లి ధరలు మండిపోతున్నాయి. అలాగే కందిపప్పు, శనగపప్పు, మినపప్పు ధరలు గతంలో కంటే రెట్టింపు స్థాయికి చేరుకుంటుండడంతో ఏం చేయాలో పాలుపోక సామాన్య, మధ్యతరగతి ప్రజలు దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నారు.

### అసలు ఎల్‌నినో అంటే ఏమిటి?

ప్రపంచంలోనే అతిపెద్ద మహాసముద్రం అయిన పసిఫిక్‌లో సముద్ర ఉపరితల నీటి ఉష్ణోగ్రతల్లో అసాధారణ మార్పుల కారణంగా ఎల్‌నినో అనే పర్యావరణ మార్పు ఏర్పడింది. ఈ వాతావరణ మార్పు డిసెంబర్ చివరి నాటికి (క్రిస్మస్ సమయానికి) దక్షిణ అమెరికా ఖండం చిలీ దేశంలోని తీరప్రాంతంలో స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే దీనికి ఎల్‌నినో అనే పేరు వచ్చింది. నిజానికి ఎల్‌నినో అనే స్పానిష్ పదానికి అర్థం చిన్నపిల్లవాడు లేదా బాలయేసు. ఇక భారతదేశం విషయానికి వస్తే ఎల్‌నినో ఏర్పడిన సంవత్సరాల్లో రుతుపవన వర్షపాతాల్లో మార్పులు ఏర్పడి కరువు విజృంభించే అవకాశం ఉంటుంది.

## ముంచిన నైరుతి, ఈశాన్యం పైనే ఆశలు!

జూన్ నుంచి సెప్టెంబర్ నాటికి నైరుతి రుతుపవనాలతో ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 500 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 220మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైనట్లు తెలుస్తోంది. అంటే మొత్తం వర్షపాతంలో 51 నుంచి 54 శాతం వరకు లోటు కనిపిస్తోంది. ముఖ్యంగా ఎల్‌నినో వరి, పత్తి, కంది, మొక్కజొన్న వంటి పంటలపై ప్రభావం చూపుతోంది. దాదాపు 300 మండలాల్లో కరువు ఛాయలు కనిపిస్తుండడంతో మొత్తం 2.44 లక్షల హెక్టార్లలోని పంటల దిగుబడి అగమ్యగోచరంగా మారింది. దీంతో ఖరీఫ్ సీజన్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో వచ్చే ఈశాన్య రుతుపవనాల పైనే రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు. ఈశాన్యంలోనూ వర్షాభావ పరిస్థితులే ఎదురైతే పంటల దిగుబడి మరింత పడిపోయి, నిత్యావసర వస్తువులు మరింతగా పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఫలితంగా రోజువారీ వినియోగ వ్యయం పెరిగి ప్రజల ఆదాయం మొత్తం హారతికర్పూరం కావడం తథ్యమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఏపీ ప్రభుత్వం అప్రమత్తం!

ప్రకృతి విపత్తులు వచ్చినా, వాతావరణం సహకరించకపోయినా దాని ప్రభావం ప్రత్యక్షంగా సామాన్యుడి జేబుపైనే పడుతుందనడంలో సందేహం లేదు. ప్రస్తుతం ఏపీ ఎదుర్కొంటున్న అతిపెద్ద గండం 'ఎల్‌నినో'. దీని కారణంగా సకాలంలో వానలు పడకపోవడం, ఉష్ణోగ్రతల్లో తీవ్ర హెచ్చుతగ్గుల వల్ల వాతావరణం మారిపోవడంతో అన్నివర్గాల వర్గాల ప్రజలు సతమతం అవుతున్నారు. ఈ విపత్కర పరిస్థితులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫోకస్ పెట్టారు. ఇటీవల కలెక్టర్లు, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి రైతు సేవా కేంద్రాల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఎల్‌నినో ఎఫెక్ట్ వల్ల జనాలపై ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడటానికి వీల్లేదని, ముఖ్యంగా నిత్యావసరాల ధరలు పెరిగితే ఊరుకునేది లేదని అధికారులను గట్టిగా హెచ్చరించారు. ఎల్‌నినో అన్నది కేవలం రైతులకు మాత్రమే సంబంధించిన సమస్య కాదని, ఇది మొత్తం వ్యవస్థలన్నింటినీ షేక్ చేస్తుందని సీఎం గుర్తుచేశారు. వర్షాభావం నెపంతో మార్కెట్‌లో బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువుల ధరలను బ్లాక్‌మార్కెట్‌లో అమాంతం పెంచేసే ప్రమాదం ఉందని, కృత్రిమ కొరత సృష్టించి లాభాలు దండుకోవాలనుకునేవారిపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. గోదాముల్లో ఉన్న బియ్యం నిల్వలను వెంటనే ఓపెన్ మార్కెట్‌లోకి రిలీజ్ చేసి, బియ్యం ధరలు అదుపులో ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే ఉల్లి కొరత రాకుండా ఇతర ప్రాంతాల నుంచి ముందస్తుగానే కొనుగోళ్లు జరుపుతున్నామని, భవిష్యత్‌లో లోకల్‌గానే ఉల్లి సాగును భారీగా ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## దుర్భర పరిస్థితులను అధిగమించేందుకు!

రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఏకంగా 50.7 శాతం మేర లోటు వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో 30.84 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా, ఈ ఎల్‌నినో దెబ్బకు ఇప్పటివరకు కేవలం 79 శాతం భూముల్లోనే పనులు మొదలయ్యాయి. అందుకే రైతులకు ఇన్సూరెన్స్ పరిహారం వెంటనే అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం మానిటర్ చేయాలని సీఎం ఆదేశించారు. ఈ విపత్కర పరిస్థితిని ఛాలెంజ్‌గా తీసుకుని ముందస్తు యాక్షన్ ప్లాన్‌ను గ్రౌండ్ లెవెల్‌లో ఎగ్జిక్యూట్ చేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం అధికారులను అప్రమత్తం చేశారు. లోటు వర్షపాతం ఉన్న ప్రాంతాల్లో 5.21 లక్షల హెక్టార్లలో సాగు చేసేందుకు పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీపై సరఫరా చేశారు. తక్కువ నీటితో పండే పంటలను, ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు ఎంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇక కూరగాయల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండాలంటే స్వయం సహాయక సంఘాల(డ్వాక్రా) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కిచెన్ గార్డెన్లను భారీగా పెంచాలని సీఎం సూచించారు. ఇంటి వద్దే కూరగాయలు పండిస్తే లోకల్ డిమాండ్‌కు సరిపడా సరఫరా లభించి రేట్లు అదుపులోకి వస్తాయి. మరోవైపు ఎల్‌నినో వల్ల ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకూడదని, పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పచ్చదనం తగ్గకుండా జలధార వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. ప్రస్తుతం గ్రామాల్లో స్థానిక ఎన్నికల హడావుడి ఉన్నప్పటికీ, ప్రజాప్రతినిధులు ప్రచారంతో పాటు ప్రతీ గ్రామంలో పర్యటించి రైతులకు ధైర్యాన్ని ఇవ్వాలని, ప్రత్యామ్నాయ పంటలపై గైడెన్స్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు కలిసికట్టుగా పనిచేస్తే ఎల్‌నినో గండాన్ని చాకచక్యంగా దాటవచ్చని స్పష్టం చేశారు. ఏదేమైనా రాష్ట్రంలో కరువు పరిస్థితి ప్రజలను, ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా ధరాభారం సామాన్యులని ఊపిరి సలుపుకోనివ్వడం లేదు. భవిష్యత్‌లోనైనా వరుణదేవుడు కరుణించకుంటే రాష్ట్రంలో పరిస్థితులు మరింత దిగజారే పరిస్థితి తప్పకపోవచ్చు. తద్వారా మండే ఎండలు, ఎండే పంటలు, పెరిగే ధరలు, రగిలే గుండెలు, ఆంధ్రప్రజలకు నిత్యకృత్యమయ్యే అవకాశం ఉంది. తస్మాత్ జాగ్రత్త!

### ఎల్‌నినోతో లక్షలాది మరణాలు?

ఈసారి ఎల్‌నినో మరింత తీవ్రంగా ఉంటుందని, అది సూపర్ ఎల్‌నినోగా మారి వాతావరణ ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతాయని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు ప్రపంచంలో సుమారు 4.51లక్షల మరణాలు, భారత్‌లో కనీసం 15వేల మందికిపైగా మరణాలు సంభవిస్తాయని ఓ అధ్యయన సంస్థ తాజాగా హెచ్చరించింది. ఈ పరిస్థితులను బట్టి ఉష్ణోగ్రతలు ఎంత దారుణంగా ఉండబోతున్నాయో ఊహించుకోవచ్చు.

# నకిలీ బీసీ సర్టిఫికెట్లపై..కఠినచర్యలు తీసుకోవాలి

### బీసీవై అధ్యక్షుడు బాలాజీ

నకిలీ బీసీ సర్టిఫికెట్లతో కొంతమంది రాజ్యాంగపరంగా బీసీలకి వచ్చే అవకాశాలను కాజేస్తున్నారని, అలాంటివారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని బీసీవై (భారత చైతన్య యువజన) పార్టీ నాయకుడు బుధవారాపు బాలాజీ ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 23న నెల్లూరు నగరంలోని మైపాడురోడ్డులో ఉన్న ఆర్‌ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బీసీ కులాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, తమ పార్టీలో బీసీ కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం ఉంటుందన్నారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీవర్గాలతో పాటు అగ్రవర్ణ పేదలకు కూడా అవకాశం కల్పిస్తామన్నారు. పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యులు ఎస్ఎస్‌యాదవ్, డా.గుంజి నరసింహారావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సోమగోపాల్, నాయకులు లీలా కృష్ణ యాదవ్, కొణిదెల నాగేంద్ర, మహిళా కన్వీనర్ హిమబిందు, సోమ అనూరాధ, ముత్యంగౌడ్ పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. ఉచిత వైద్యశిబిరం



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ ఇఎన్‌టి సర్జన్ డాక్టర్ పి.పూజిత పాల్గొని వాకర్స్‌కి సైనసైటిస్, గురక, గొంతు సంబంధిత వ్యాధుల గురించి అవగాహన కలిగించారు. 150 మందికి షుగర్, బీపీ పరీక్షలతో పాటు చెవి-గొంతు పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నసీర్ అహ్మద్, కార్యదర్శి సానంపూడి సుబ్బరాయుడు, కోశాధికారి సితారి రత్నయ్య, గౌరవ అధ్యక్షులు బిరదవోలు రామ్మోహన్‌రెడ్డి, 203-డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, డిప్యూటీ గవర్నర్ జీవి కృష్ణయ్య, మాగంటి ప్రసాద్, వినుకొండ వెంకటేశ్వర్లు, పత్తిపాటి రమణయ్య, యు.గోవర్ధన్, నవీన్, బెల్లం చెంచయ్య, భాస్కర్‌నాయుడు, అమరలింగం పాల్గొన్నారు.

## ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం.. సీపీఎం ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు నగరంలోని 53, 54 డివిజన్లలో ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక వెంకటేశ్వరపురం సెంటర్‌లో ఈనెల 23న సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎంతోకాలంగా ఈ ప్రాంతంలో ఇళ్లకు రిజిస్ట్రేషన్‌లు లేక ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, ప్రభుత్వం పరిశీలించి పేదల సమస్యలు తీర్చాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు కోరారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు మూలం ప్రసాద్, షేక్ మస్తాన్, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 'పిడికిలి వదిలినప్పుడు'.. కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

నెల్లూరు కవి పెరుగు రామకృష్ణ రచించిన 'పిడికిలి వదిలినప్పుడు' కవితాసంపుటిని ఇటీవల నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యం సమాజాన్ని చైతన్యపరిచే సాధనమని, సమాజంలో వస్తున్న మార్పులు, మానవ సంబంధాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను కవులు తమ రచనల్లో ప్రతిబింబించాలన్నారు. డాక్టర్ పెరుగు రామకృష్ణ సామాజిక అంశాలపై స్పందిస్తూ మంచి రచనలు చేస్తున్నారని కొనియాడారు. విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతి ఆచార్య మాణికంఠ, సహాయక ఆచార్యులు చిన్నం రాజారాం, కుమ్మెతల లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నగర పరిధిలో..
# మహిళలే మహారాణులు

**పురుష ఓటర్లు 2,37,972**
**మహిళా ఓటర్లు 2,51,293**

నెల్లూరు నగర ఓటర్లలో మహిళలే అధికంగా ఉండడంతో, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మహిళా ఓటర్లదే పైచేయిగా ఉంటోంది. గతంలో 54 డివిజన్లు ఉన్న నెల్లూరు నగరం, ఇటీవలే పునర్విభజన జరిగి 72 డివిజన్లు ఏర్పడ్డాయి. కార్పొరేషన్ అధికారులు తయారుచేసిన ముసాయిదా ప్రకారం తాజాగా ఓటర్ల జాబితా చూస్తే, పురుష ఓటర్ల కంటే 13,321 మంది మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం. మొత్తంగా కార్పొరేషన్ పరిధిలో 4,89,351 మంది ఓటర్లుంటే అందులో 2,37,972 మంది మాత్రమే పురుష ఓటర్లు. మహిళా ఓటర్ల సంఖ్య వారికంటే ఎక్కువగా..2,51,293 మంది ఉన్నట్లు తేలింది. ఇతరులు మరో 86 మంది ఉన్నట్లు నమోదైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో మరో అడుగు ముందుకు పడినట్లయింది. ఓటర్ల జాబితా ప్రకారం త్వరలోనే పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాని, ఆ తర్వాత డివిజన్ల వారీగా రిజర్వేషన్లను కూడా నిర్ణయించి పూర్తిస్థాయిలో జాబితా విడుదల చేసేందుకు అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియలు పూర్తయ్యాక ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ ఎన్నికల నిర్వహణకి సంబంధించి రిటర్నింగ్ ఆఫీసర్‌గా జేసీ వెంకటేశ్వర్లును నియమిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. ఆమేరకు ఇతర ఆర్ఓలు, సహాయక అధికారులను కూడా నియమించినట్లు సమాచారం. నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలకు రంగం సిద్ధం అవుతున్న తరుణంలో అభ్యర్థుల ఎంపికలో రాజకీయనాయకులు తలమునకలై ఉంటే, మరోవైపు ఎన్నికల నిర్వహణకి సంబంధించిన ఏర్పాట్లతో అధికార యంత్రాంగం సతమతమవుతూ ఉంది.

# పరిశ్రమలకు పుష్కలంగా అవకాశాలు

- కలెక్టర్ హిమాన్షు శుక్ల వెల్లడి



'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్' వర్క్‌షాప్‌ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పుష్కలంగా అవకాశాలున్నాయని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల విజయానికి సరైన ఉత్పత్తి ఎంపిక, ఆధునిక సాంకేతికత, ప్రాజెక్టు ఫైనాన్సింగ్, డిజిటైజేషన్, ఈ–కామర్స్, డిజిటల్ మార్కెటింగ్ అనే ఐదు అంశాలు కీలకమని తెలిపారు. ఈనెల 24వ తేదీ గురువారం నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బ కళాక్షేత్రంలో జిల్లా పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో ఏర్పడే పారిశ్రామిక అవకాశాలను అధ్యయనం చేసి సరైన ఉత్పత్తిని ఎంపిక చేసుకోవాలని వర్ధమాన పారిశ్రామికవేత్తలకు కలెక్టర్ సూచించారు. నగర మేయర్ దేవరకొండ సుజాత, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వీరేంద్ర కుమార్, ఏపీఐఐసీ డైరెక్టర్ కంచర్ల మాధవి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్‌బాబు, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఎల్‌డీఎం మణిశేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవకులకు
# వేమిరెడ్డి దంపతుల కానుక

- 5 వేల మందికి వస్త్రాల బహుకరణ



తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో స్వామివారి సేవలో నిమగ్నమై భక్తిశ్రద్ధలతో విధులు నిర్వహిస్తున్న సుమారు 5వేలమంది టీటీడీ సిబ్బందికి వేమిరెడ్డి దంపతులు ఈనెల 20న వస్త్ర బహుమానం అందజేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవ సేవకులను గౌరవిస్తూ వేమిరెడ్డి దంపతులు చేపడుతున్న ఈ సేవ గత 8ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతోంది. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో తిరుమలలోని వైభవోత్సవ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీటీడీ ఇఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఓ సిహెచ్ వెంకయ్యచౌదరి పాల్గొని, వారి చేతులమీదుగా సిబ్బందికి వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఇఓ రవిచంద్ర మాట్లాడుతూ.. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు శ్రీవారి సేవకులకు వస్త్ర బహుమానం అందించడం అభినందనీయమన్నారు. శ్రీవారి కృపాకటాక్షాలు వేమిరెడ్డి దంపతులకు, వారి కుటుంబసభ్యులకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

# ఈ ఆదివారం బ్యాంకులు పని చేస్తాయి?

ఈ నెల 28 నుండి మూడు రోజులపాటు సమ్మె చేయాలని బ్యాంకు ఉద్యోగ సంఘాలు భావిస్తున్న తరుణంలో ఉద్యోగుల సమ్మె ప్రభావాన్ని తగ్గించేందుకు సెప్టెంబర్ 27వ తేదీ ఆదివారం నాడు ప్రభుత్వరంగ బ్యాంకులు పని చేసేలా కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ఈ ఆదివారం బ్యాంకులు పని చేస్తాయని భావిస్తున్నారు.




ప్రథమ వర్ధంతి

అమృతమూర్తి, ఆత్మీయదీప్తి

శ్రీమతి కేసవరపు గిరిజమ్మ

స్వర్గస్తురాలై తేది. 25.9.26 నాటికి ఏడాది గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తి స్మృతికి అంజలి ఘటిస్తూ...

భర్త : కేసవరపు ఆదినారాయణరెడ్డి

కుమార్తె - అల్లుడు
బుర్లా లక్ష్మి
బుర్లా శరత్‌కుమార్

కుమారుడు - కోడలు
డాక్టర్ కేసవరపు సుబ్బారెడ్డి
డాక్టర్ పద్మిని శిల్ప

మనుమడు, మనుమరాళ్ళు:
డాక్టర్ నేహ, అమిత్, తన్వి

లాయర్
సెప్టెంబర్ 25, 2026

# ప్రజలను బెంబేలెత్తిస్తున్న బీపీలూ..షుగర్లూ!

ఆధునిక జీవనశైలి ఆరోగ్యాన్ని ఎంతగా దెబ్బతీస్తుందో నిపుణులు, శాస్త్రవేత్తలు ఎంతోకాలంగా చెప్తున్న మాటలు ఇప్పుడు నిజమవుతున్నాయి. గత కొంతకాలంగా దాని తాలూకు విషఛాయలు చాపకింద నీరులా ఉంటూ, ఇప్పు డిప్పుడే బయటపడుతున్నాయి. దేశంలో ఎక్కడ చూసినా గతంలో ఎప్పుడూ లేనంతగా వ్యాధుల బాధలు ప్రజలను పీడిస్తున్నాయి. బీపీలు, షుగర్లు భారీగా పెరిగిపోయి రోగులను బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ వ్యాధుల బాధితుల సంఖ్య కోటి 7 లక్షల మందికి పైగానే ఉండడం ఎంతైనా విచారకరం. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఎన్‌సీడీ 4.0 సర్వే అనేక ఆందోళనకరమైన విషయాలను వెల్లడించింది. మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్లు మారిపోవడం, శారీరక్రశ్రమ బాగా తగ్గిపోవడం, అన్నిటికీ మించి రకరకాల మానసిక వత్తిడులతో నిద్రలేమి తదితర కారణాలతో వ్యాధులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆ సర్వే స్పష్టం చేసింది. సాక్షాత్తూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ గత ఆగస్టు నెలా ఖరుదాకా నిర్వహించిన సర్వేలో, ఇంటింటికీ వెళ్ళి సుమారు 2.86 కోట్ల మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తే వీరిలో 29.29 లక్షల మందికి అధిక రక్తపోటు (బీపీ) ఉన్నట్లు నిర్ధారణ కావడం గమనార్హం. వీటిలో కొత్తగా గుర్తించిన సుమారు 11.79 లక్షల కేసులు కూడా ఉన్నాయట. అదేవిధంగా, 48.15 లక్షల మందికి షుగర్ (మధుమేహం) వ్యాధి ఉన్నట్లు కూడా తేలింది. వీటిలో కొత్తగా 10.72 లక్షల కేసుల వరకు ఉన్నట్లు నమోదైంది. మొత్తంగా రాష్ట్రంలో ఈ వ్యాధుల బాధితులు కోటీ 7 లక్షల మందికి పైగానే ఉన్నారని, ప్రతి పదిమందిలో ఒకరికి బీపీ, మరొకరికి షుగర్ ఉందని సర్వేలో స్పష్టమైంది. ఈ వ్యాధుల పెరిగేందుకు ముఖ్య కారణం అధిక ఆహారం తీసుకోవడం, ఉప్పు, చక్కెర ఎక్కువగా ఉన్న పదార్థాలను తినడం, ఎక్కువగా ఆలోచిస్తూ మానసిక వత్తిడికి గురికావడం, నిద్ర సరిగా పోకపోవడం, శారీరక శ్రమ లోపించడం..మొత్తంగా జీవనశైలి మార్పులు దీనికి కారణమని నిపుణులు చెప్తున్నారు. రాష్ట్ర జనాభాలో సుమారు 66.05 శాతం మందికి ఆరోగ్యపరీక్షలు చేస్తే, 59.29 లక్షల మందికి బీపీ, 48.15 లక్షల మందికి షుగర్ వ్యాధులున్నాయంటే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో ఊహించుకోవచ్చు. అందులోనూ ఇవి దీర్ఘకాలంగా బాధించే వ్యాధులు. ఆరోగ్యానికి ముప్పుతెచ్చే ఇలాంటి జీవనశైలి వ్యాధులను నిర్లక్ష్యం చేస్తూ, వాటిని సరిగా పట్టించుకోక, వ్యాధుల పట్ల సరైన అవగాహన లేక, దొరికిన మందులు వాడేసుకుంటూ మరింత అనారోగ్యానికి గురవుతున్నవారు కూడా అధికంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రకరకాల క్యాన్సర్ వ్యాధులు కూడా ప్రజలను చుట్టుముడుతున్నాయి. క్యాన్సర్ బాధితులు కూడా లక్షల సంఖ్యలో ఉన్నారు. ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లను మానుకోలేక, వాటి వల్ల ఇంకా అనేకరకాల బాధలతో అనునిత్యం సతమతమవుతున్నవారు కూడా లక్షల్లోనే ఉంటున్నారు. గతంలో వయసు పైబడినప్పుడు వచ్చే బీపీ, షుగర్ లాంటి వ్యాధులు ఇప్పుడు బాల్యం నుంచే సంక్రమిస్తున్నాయి. అందులోనూ కల్తీ పదార్థాలు తినేయడం వల్లా ఎన్నో రకాల వ్యాధులు ప్రజల ఆరోగ్యాన్ని నంజుకుతింటున్నాయి. అరచేతిలో స్వర్గం అన్నట్లుగా చేతికి సెల్‌ఫోన్‌లు వచ్చాక, రాత్రింబవళ్ళు వాటితోనే గడిపేస్తూ, నిద్రాహారాల మీద కూడా ఆసక్తి లేక మానసిక వత్తిళ్ళతోనే జీవించడం కోట్లాదిమందికి అలవాటైపోయింది. దీంతో, మన చేత్తోనే మన ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నామని తెలుసుకునేసరికి.. పరిస్థితి చేయిదాటిపోతుంది. శారీరక-మానసిక ఆరోగ్యాలకి ప్రాధాన్యతనిస్తూ ఎప్పటికప్పుడు తగిన విశ్రాంతి తీసుకోకపోవడం వల్ల అధికశాతం మంది అనారోగ్యాల బారినపడుతున్నారని నిపుణులు చెప్తున్నారు. చేసే పనికీ, వ్యక్తిగత జీవితానికి సమతుల్యత లేకపోతే ఆరోగ్యం బాగా దెబ్బతింటుందని, ఆ తర్వాత ఎంత బాధపడినా ప్రయోజనం లేదని కూడా స్పష్టం చేస్తున్నారు. ఇకనైనా, మన పెద్దలు చెప్పినట్లు మంచి అలవాట్లతో జీవించాలి. వేళకి నిద్ర-ఆహారం ఉండేలా చూసుకోవాలి. ఈ ఆధునిక ప్రపంచంలో ఒత్తిడి అనేది జీవితంలో తప్పనిసరి కావచ్చు. కానీ, నిత్యం ఒత్తిడితోనే జీవించడమనేది తప్పనిసరి కాకూడదు. డబ్బు లేకున్నా పర్వాలేదు..జబ్బు లేకుండా చూసుకోవాలి!..

ఇకనైనా మన జీవనశైలిని మనమే ఆరోగ్యకరంగా చక్కదిద్దుకోవాలి. ఆరోగ్యంగా బతకడమే ముఖ్యం అనుకోవాలి. ఎప్పుడు ఏది ఎంత అవసరమో మనకు మనమే నిర్ణయించుకోవాలి. డబ్బు ఎంత సంపాదించినా, మంచి ఆరోగ్యం సంపాదించుకోలేకపోతే ఎంతున్నా దండగే. మానసిక ప్రశాంతత కంటే గొప్ప ఆస్తి ఏమీ లేదు. బీపీ-షుగర్‌లాంటి వ్యాధులను కేవలం మందులతో నియంత్రించే దశ నుంచి.. జీవనశైలిని సరైన దిశగా మార్చుకునే దశకి మారాలి. లేకుంటే, ఇలాంటి ప్రమాదకర వ్యాధులతో బతికినంతకాలం బాధపడడం తప్ప మరో మార్గాంతరం కనిపించడం లేదు!..

# తిరుమల నెయ్యి వ్యవహారంలో ప్రభుత్వం అత్యుత్సాహం!

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి ఉపయోగించిన నెయ్యి వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తు సంస్థల తాజా వివరాలు చూస్తే ఒక విషయం స్పష్టమవుతోంది. నెయ్యిలో కల్తీ జరిగినట్లు దర్యాప్తులో తేలినప్పటికీ, లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు రుజువుకాలేదు. సిబిఐ ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తు, ప్రయోగశాల నివేదికలను పరిశీలించిన అనంతరం జంతువుల కొవ్వు ఉన్నట్లు నిర్ధారణకాలేదని వెల్లడించింది. అదే సమయంలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్ తదితర పదార్థాలతో నెయ్యి కల్తీ చేసినట్లు దర్యాప్తులో తెలిసింది. అంటే కల్తీ అంశం వాస్తవమే అయినా, జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణకు స్పష్టమైన ఆధారాలు లభించలేదు. అప్పట్లో ప్రభుత్వం, కూటమి నేతలు కేవలం నెయ్యి కల్తీని మాత్రమే ప్రధాన అంశంగా ప్రజల ముందుంచితే, అది తీవ్రమైన వ్యవహారంగా ప్రజలు అర్థం చేసుకునేవారు. కానీ, జంతువుల కొవ్వు కలిసిందనే అంశాన్ని కూడా బలంగా ప్రచారం చేయడం వల్ల ఇప్పుడు దర్యాప్తు నివేదికల నేపథ్యంలో ఆ వాదన నిరాధారమని తేలిపోయింది. తిరుమల లాంటి పవిత్ర క్షేత్రానికి సంబంధించిన వ్యవహారంలో రాజకీయ ఆరోపణల కంటే వాస్తవాలు, శాస్త్రీయ పరీక్షలు, దర్యాప్తు నివేదికలకే ప్రాధాన్యం కల్పించాలి. నెయ్యి నాణ్యతలో జరిగిన అక్రమాలను వెలుగులోకి తీసుకురావడం అవసరమే. బాధ్యులపై చర్యలు తీసుకోవడం కూడా అంతే అవసరం. కానీ, నిర్ధారణ కాని అంశాలను సంచలనాత్మకంగా ముందుకు తీసుకెళ్లడం వల్ల చివరకు అసలు కల్తీ వ్యవహారం కూడా రాజకీయ వివాదంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని రాజకీయ కోణంలో కాకుండా, దర్యాప్తు సంస్థలు నిర్ధారించిన అంశాల ఆధారంగా ప్రజలకు వివరించాలి. తిరుమల పవిత్రతకు సంబంధించిన అంశాల్లో మాటల కంటే ఆధారాలకే ప్రాధాన్యం ఇవ్వాలి. అదే భక్తుల విశ్వాసాన్ని, వ్యవస్థ విశ్వసనీయతను నిలబెడుతుంది.

*లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.*

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## జగన్‌కి రాజకీయ శత్రువు జగనే, షర్మిల కాదు!

గత వారం మన 'లాయర్'లో "కలిసుందాం... రా" హెడ్డింగుతో రాసిన మొదటి పేజీ వార్త చదవడానికి బాగుంది కానీ, ప్రాక్టికల్‌గా అది సాధ్యం కాదు. ఎందుకంటే షర్మిల కాంగ్రెస్. జగన్ స్వంత కాంగ్రెస్. షర్మిల కాంగ్రెస్‌కు రిజైన్ చేసి, ఇవతలకు రావాలి. అప్పుడు ఆమె క్రెడిబిలిటీ జీరో. జగన్ పార్టీకి ఆమె లయబిలిటీ అవుతుంది తప్ప బలం కాదు. జగన్‌తో కలిస్తే, ఆమె రాజకీయాల నుంచి నిష్క్రమించాలి. అది ఆవిడ డీఎన్ఏకి విరుద్ధం. ఇక జగన్ ఆవిడకు ఓ గౌరవప్రదమైన హోదా గానీ, పదవి గానీ ఇవ్వడానికి అతని వెనుక ఉన్న శక్తులు అంగీకరించవు. షర్మిల జగన్ పార్టీలోకి వస్తే, ఆమే పార్టీని డామినేట్ చేస్తుంది. జగన్ డమ్మీగా మారిపోతాడు. కాబట్టి 'లాయర్' రాసింది ఊహా జనితమే అవుతుంది తప్ప ప్రాక్టికల్‌గా సాధ్యం కాదు.

*భోగాది వేంకటరాయుడు, హైదరాబాదు.*

# మహమ్మారిగా.. డిజిటల్ వ్యసనం

మనసులో మాట 116

దేశంలో ఇప్పుడు డిజిటల్ వ్యసనం మహమ్మారిగా మారిపోతోంది. మరోవైపు జంక్‌ఫుడ్ ప్రతి ఇంటా కలవరపర్చే అంశమయిపోయింది. పిల్లలను జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచడం తల్లిదండ్రులకు చాలా కష్టమైపోయింది. రోజువారీ ఆహారంలో సింహభాగం జంక్‌ఫుడ్ లేదా ప్రాసెస్డ్ ఆహారం లేదా ఫాస్ట్ ఫుడ్ తిని పెరుగుతున్న తరం ఒకటి తయారవుతోంది. ఇది చాలా ఆందోళన కలిగించే అంశం. ఈ తరం రేపు వివాహ వ్యవస్థలోకి అడుగుపెట్టిన తర్వాత జంక్‌ఫుడ్ అనేది కుటుంబాల అలవాటుగా మారిపోయే ప్రమాదముంది.

దేశంలో అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ (జంక్ ఫుడ్) విచ్చలవిడి విక్రయాలపై అత్యున్నత న్యాయస్థానం(సుప్రీంకోర్టు) జారీ చేసిన తాజా ఆదేశాలు, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తెస్తున్న కఠిన మార్గదర్శకాలు భవిష్యత్తు భారత్‌పై ఆశలు కల్పిస్తున్నాయి. ప్యాకేజ్డ్ ఫుడ్ ప్యాకెట్ల ముందు భాగంలోనే ఉప్పు, చక్కెర, కొవ్వు స్థాయిలను స్పష్టంగా తెలిపే ప్రమాద హెచ్చరికల గుర్తులను ముద్రించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, FSSAIకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. "కంపెనీల వ్యాపార ప్రయోజనాలు, లాభాల కంటే దేశ ప్రజల, ముఖ్యంగా ఎదుగుతున్న చిన్నపిల్లల ఆరోగ్య భద్రతే అత్యంత ముఖ్యం" అని కోర్టు స్పష్టం చేసింది. అంతేకాకుండా, 16ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై వయో పరిమితి విధించే అంశంపై ఆంధ్రప్రదేశ్, గోవా వంటి రాష్ట్ర ప్రభుత్వాలు చట్టపరమైన అవకాశాలను పరిశీలిస్తుండటం, పిల్లల డిజిటల్ భద్రతపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు ఇవ్వడం ఈ సంక్షోభ తీవ్రతకు అద్దం పడుతోంది.

న్యాయస్థానాలు, FSSAI, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ స్థాయిలో వేగంగా స్పందించి చర్యలకు దిగడం వెనుక ఒక బలమైన నేపథ్యం ఉంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేంద్ర చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ వి.అనంత నాగేశ్వరన్ సమర్పించిన ఆర్థిక సర్వే 2025-26 లోని హెచ్చరికలే ఈ తాజా పరిణామాలకు ప్రధాన కారణం.

సాధారణంగా ఆర్థిక సర్వే అనగానే జీడీపీ వృద్ధి రేటు, విదేశీ మారకద్రవ్య నిల్వలు, లోటు గణాంకాలకే పరిమితమవుతుందనే భావన ఉంటుంది. కానీ, దానికి పూర్తి భిన్నంగా ఈ ఆర్థిక సర్వే "ఆరోగ్య పరిరక్షణ" అధ్యాయం కింద జంక్ ఫుడ్ సంస్కృతి, స్థూలకాయం, అపరిమిత స్క్రీన్ టైమ్, సోషల్ మీడియా వ్యసనం వంటి అంశాలను ప్రత్యేకంగా పొందుపరిచింది. భారతదేశం ప్రస్తుతం అనుభవిస్తున్న జనాభా ప్రయోజనం ఫలించాలంటే కేవలం నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే సరిపోదని, పనిచేసే వయస్సులో ఉన్న శ్రామిక శక్తి శారీరక, మానసిక ఆరోగ్యం అత్యంత కీలకమని సర్వే కుండబద్దలు కొట్టింది. శ్రామిక శక్తిలో అనారోగ్యం, మానసిక ఆందోళన పెరిగితే అది దేశ దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధిని మందగింపజేసే ఒక "సైలెంట్ స్మాక్" (నిశ్శబ్ద ముప్పు)గా మారుతుందని సీఈఓ నాగేశ్వరన్ హెచ్చరించారు. జంక్‌ఫుడ్, స్థూలకాయం సంక్షోభం ఎంత వేగంగా విస్తరిస్తుందో ఆర్థిక సర్వే అందించిన గణాంకాలు నిరూపిస్తున్నాయి. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే డేటాను ఉటంకిస్తూ, దేశంలో ప్రతి ఐదుగురు పెద్దలలో ఒకరు అధిక బరువు లేదా స్థూలకాయంతో బాధపడుతున్నారని సర్వే పేర్కొంది. అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్, అధిక చక్కెర కలిగిన పానీయాల వినియోగం పెరగడం వల్ల చిన్న వయస్సులోనే మధుమేహం, గుండె జబ్బులు, బిపి వంటి తీవ్రమైన అనారోగ్యాలు ముసురుకుంటున్నాయి. ఇది కేవలం ఉన్నత వర్గాలకే పరిమితం కాకుండా అన్ని ఆదాయ వర్గాలకూ విస్తరించింది. దీనిని అరికట్టడానికి ఉదయం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు టీవీ, డిజిటల్ మీడియాల్లో జంక్‌ఫుడ్ ప్రకటనలను నిలిపివేయాలని, ప్యాకెట్లపై పారదర్శకమైన సమాచారం ఉండాలని సర్వే నొక్కిచెప్పింది. ఈ ఆర్థిక సర్వే హెచ్చరికల ఆధారంగానే ఎఫ్ఎస్ఎస్ఏఐ ఇప్పుడు 'నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్' మార్గదర్శకాలకు అనుగుణంగా ఆహార నాణ్యతా ప్రమాణాలను కఠినతరం చేస్తోంది. ప్యాకేజ్డ్ ఫుడ్ కంపెనీలు తమ వ్యాపార నష్టాలను సాకుగా చూపుతూ లేబులింగ్ నిబంధనలను వాయిదా వేయాలని చూసినప్పటికీ, సుప్రీంకోర్టు కఠిన వైఖరితో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ మార్గదర్శకాల అమలును వేగవంతం చేయక తప్పలేదు.

మరోవైపు, నిశ్శబ్ద మహమ్మారిలా విస్తరిస్తున్న డిజిటల్ వ్యసనం మరియు చిన్న పిల్లల్లో పెరుగుతున్న సోషల్ మీడియా వాడకంపై కూడా సర్వే తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అపరిమిత స్క్రీన్ టైమ్, డిజిటల్ వేదికలపై ఇతరులతో నిరంతరం పోల్చి చూసుకోవడం వల్ల యువతలో ఆందోళన (Anxiety), తీవ్రమైన మానసిక ఒత్తిడి, నిరాశ పెరుగుతున్నాయని సర్వే వెల్లడించింది. ఈ ముప్పును అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం "డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (DPDP) యాక్ట్" ద్వారా ఇప్పటికే చట్టపరమైన చెక్‌పాయింట్లను ఏర్పాటు చేసింది. ఈ చట్టం ప్రకారం 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలబాలికల డేటాను ప్రాసెస్ చేయాలన్నా, లేదా వారి పేరిట సోషల్ మీడియా ఖాతాలు తెరవాలన్నా తల్లిదండ్రులు/గార్డియన్ల ప్రత్యక్ష అంగీకారం తప్పనిసరి. అంతేకాకుండా, పిల్లలను లక్ష్యంగా చేసుకుని చూపే పర్సనలైజ్డ్ అడ్వర్టైజ్‌మెంట్లను కూడా ఈ చట్టం నిషేధించింది. దీనివల్ల జంక్ ఫుడ్ వంటి వాటికి సంబంధించి ప్రకటనలు సోషల్ మీడియాలో కనిపించే అవకాశం తగ్గవచ్చు. మొత్తం మీద ఆర్థిక సర్వే 2025-26 లేవనెత్తిన ఈ కీలక అంశాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు, ఎఫ్ఎస్ఎస్ఏఐ కఠిన నిబంధనలు, డీపీడీపీ చట్ట అమలు, రాష్ట్రాల చొరవతో సమగ్ర కార్యాచరణగా రూపాంతరం చెందుతున్నాయి. నైపుణ్యాలు ఉన్న శ్రామిక శక్తితో పాటు శారీరకంగా, మానసికంగా దారుఢ్యంతో ఉన్న యువత ఉన్నప్పుడే భారతదేశం అనుకున్న 'వికసిత భారత్' కల సాకారమవుతుంది. అందుకే పిల్లలు తీసుకునే ఆహారంపై శ్రద్ధపెట్టడం చాలా అవసరం.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్

# ఆత్మకూరును.. అభివృద్ధిలో అగ్రగామిగా చేస్తాం

## • మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



అభివృద్ధి పనులకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో ఆత్మకూరు మున్సిపాలిటీలో చేపట్టనున్న రూ. 29 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 22న కుప్పం నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 26జిల్లాల్లోని 123 మున్సిపాలిటీల పరిధిలో రూ. 11,359 కోట్ల విలువైన పనులకు సీఎం ఏకకాలంలో శ్రీకారం చుట్టారు. ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయం నుంచి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వర్చువల్ శంకుస్థాపన అనంతరం ఆత్మకూరులో చేపట్టనున్న రూ. 29 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని మంత్రి ఆనం ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాబోయే ఆరు నెలల్లో ఆత్మకూరు మున్సిపాలిటీలో రూ. 90 కోట్ల విలువైన అభివృద్ధి పనులను పూర్తి చేసి పట్టణాన్ని గ్రేడ్–2 నుంచి గ్రేడ్–1 మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం చెప్పారు. ఆత్మకూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# దుర్భర పరిస్థితుల్లో చల్లా యానాదులు

## ➢ ఐటీడీఏ సమావేశంలో సోమిరెడ్డి ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరుజిల్లాలో చల్లా యానాదులు చాలా దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని, వారిని అన్నివిధాలా ఆదుకోవాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. గిరిజనుల జీవితాల్లో వెలుగుల కోసం నెల్లూరు ఐటీడీఏను షెడ్యూల్ జాబితాలోకి చేర్చాలని కూడా ఆయన సూచించారు. నెల్లూరులోని ఐటీడీఏ కార్యాలయంలో ఇటీవల ఐటీడీఏ సమావేశం జరిగింది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఐటీడీఏ ఛైర్మెన్ సదాభార్గవి, పీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ, సమాజంలో అత్యంత పేదరికంలో ఉండేది అమాయకులైన గిరిజనులేనని, నిరక్షరాస్యుల్లో 90 శాతం మంది వారేనని, కొందరు మోసం చేసి వారి ఆస్తులను కొట్టేస్తున్నారని.. వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కూడా ఆయన కోరారు. ఐటీడీఏ ప్రాజెక్టు పరిధిలోని 92 గురుకుల పాఠశాలల్లో 100 శాతం అడ్మిషన్లు జరగడం శుభపరిణామమని, గత విద్యాసంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు 97 శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషకరమని అన్నారు. వచ్చే ఐదు ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి గిరిజనుల విద్య, విద్యం, సామాజిక అభివృద్ధి కోసం రూ. 750 కోట్లు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించామని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యానాదుల కష్టాలను గుర్తించి, రాష్ట్రంలోనే తొలిసారిగా కోవూరులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సుమారు వెయ్యి మందికి ఆధార్ కార్డులు అందజేశామని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. ఇంకా ఆధార్ లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న వారిని గుర్తించి, అధికారులు వారి నివాస ప్రాంతాలకే వెళ్లి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆమె సూచించారు. యానాదులు నివసించే ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాల కొరత ఉందని, సీఎస్ఆర్ నిధులతో ఇప్పటికే కొన్ని చోట్ల వసతులు కల్పించామని, మిగిలిన ప్రాంతాల్లోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# కథ ముగిసింది.. వ్యధ మిగిలింది!

## ➢ జడ్పీ సమావేశానికి.. మళ్లీ అధికారులు డుమ్మా!



జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను, ఎమ్మెల్సీ పర్వతరెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

'కథ ముగిసింది..వ్యధ మిగిలింది' అన్నట్లుగా తయారైంది నెల్లూరు జిల్లా జడ్పీ తీరు. అయిదేళ్లు పరిపాలించి, చివరి రోజుల్లో సమావేశాలకి ఎవరూ రాక వేదనతోనే జడ్పీ ముగిసిపోయింది. రెండుసార్లు సమావేశాలు నిర్వహించినా అధికారులెవరూ అటువైపు కన్నెత్తిచూడకపోవడం పాలకవర్గాన్ని ఆవేదనకి గురిచేసింది. ఇదెంతో అవమానకరమని వారంతా బాధను వ్యక్తం చేశారు. ఈనెల 24 గురువారం నాటికి జడ్పీ పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో, చివరి సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 17న నిర్వహించాలనుకుని ఏర్పాట్లన్నీ చేశారు. కానీ, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్‌తో పాటు అధికారులు రాకపోవడంతో, జడ్పీటీసీలు ఎంపీటీసీలు ఆ సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో, ఈనెల 24న మళ్లీ అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. అయినా, రావాల్సిన వారెవరూ రాలేదు. చివరికి సమావేశం నిర్వహించాల్సిన జడ్పీ సీఈఓ కానీ, డిప్యూటీ సీఈఓ కానీ విధులకు హాజరు కాలేదు. కనీసం సమావేశాన్ని నిర్వహించేందుకు మరో అధికారిని కూడా నియమించలేదు. గతంలో ఎప్పుడూ లేనిది.. ఇప్పుడిలా జరగడం ఏమిటని ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు అసంతృప్తికి గురయ్యారు. జడ్పీ సమావేశానికి అధికారులు కూడా రాకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఎల్‌నినో సమస్యపై చర్చిద్దామనుకున్నా ఎవరూ రాలేదని ఆనం అరుణమ్మ వాపోయారు. జడ్పీ సర్వసభ్య సమావేశాలకి అధికారులు, అధికారపార్టీ ప్రజాప్రతినిధులు రాకపోవడం జడ్పీటీసీలను అవమానించడమే కాక, వారికి ఓట్లేసి గెలిపించిన ప్రజలను కూడా అగౌరవపరచడమేనంటూ ధ్వజమెత్తారు.

చివరగా.. జడ్పీటీసీలు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మకి వీడ్కోలు తెలుపుతూ ఆత్మీయంగా సన్మానించారు. అరుణమ్మని, ఆ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని సభ్యులు గజమాలతో సత్కరించారు.

## 29న రామాపురానికి రానున్న..

# చంద్రబాబు, పవన్

## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, ఉన్నతాధికారులు



సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రులు ఆనం, నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు

నెల్లూరుజిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురంలో ఈ నెల 29న నిర్వహించనున్న జీ రామ్ జీ – పల్లె పండుగ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో రామాపురంలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు వేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డాక్టర్ పొంగూరు నారాయణ, ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ మంతెన వెంకట సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ బీదారవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల తదితరులు ఈనెల 21న ఆ ఏర్పాట్లను పరిశీలించారు. హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్, సభా ప్రాంగణం, వీఐపీ రాకపోకలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో మంత్రులు సమీక్షించారు. అనంతరం, కోకూరువారిపల్లిలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్న గోశాల వద్ద జరుగుతున్న పనులను కూడా పరిశీలించి, సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేశారు.

# ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సమీక్ష



కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఈ నెల 29వ తేదీన నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గంలోని రామాపురం గ్రామ పంచాయతీ పరిధిలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న పల్లె పండుగ–3.0 కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన వెంకట సత్యనారాయణ రాజు, జిల్లా కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా తదితరులతో కలసి ఆయన ఇటీవల కలిసి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సభా ప్రాంగణం, పార్కింగ్, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఈ కార్యక్రమాన్ని అందరూ సమిష్టి కృషితో విజయవంతం చేయాలని సూచించారు.

# పార్టీ అభివృద్ధికి.. మహిళల పాత్ర కీలకం

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వైసీపీ మహిళా కార్యకర్తలు, నాయకురాళ్లతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి మహిళల పాత్ర ఎంతో కీలకమైందని, ప్రతి మహిళా కార్యకర్త పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మహిళలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల వెంకటగిరిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు,గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ శ్రేణులు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యకర్తల మధ్య ఐక్యత, సమన్వయం పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తాయని పేర్కొన్నారు. మహిళా కార్యకర్తలు తమ సమస్యలను, ప్రజల సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళలు కీలక పాత్ర పోషించాలని కోరారు.

# నెల్లూరు కబుర్లు

## లంబోదరుడికి.. మంత్రి ఆనం పూజలు



మంత్రి ఆనంకి జ్ఞాపికని అందజేస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు

వినాయకచవితి సందర్భంగా నెల్లూరు నగర నడిబొడ్డున అత్యంత భారీ ఎత్తున ఏర్పాటు చేసిన లంబోదర గణేశ్ మహోత్సవ వేడుకల్లో ఇటీవల రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్.. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో కలిసి లంబోదర గణనాథుడికి మంత్రి ఆనం ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. స్థానిక నాయకులు చక్రవర్తన్‌రెడ్డి, మదన్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గురజాడ జయంతి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ మొగిలి వెంకటేశ్వర్లు

మహాకవి గురజాడ జయంతి సందర్భంగా ఈనెల 21న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సభ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్‌ఓ విజయకుమార్ పాల్గొని గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ సాహిత్యాన్ని, సామాజిక దృక్పథాన్ని స్మరించుకుంటూ, సమాజంలో సమానత్వం, చైతన్యం, మానవతా విలువల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సెట్నెల్ సీఇఓ నాగేశ్వరరావు, పర్యాటక అధికారి ఎస్ కె అలీ, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, మ్యూజిక్ కాలేజ్ ప్రిన్సిపల్ పినాకపాణి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మండుతున్న ధరలపై 'ఐద్వా' నిరసన



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఐద్వా మహిళలు

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలంటూ ఈనెల 22న నెల్లూరులో ఐద్వా (అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యాలయం వద్ద నుంచి పూలే విగ్రహం కూడలి వరకు ప్రదర్శన చేపట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ధరలు పెరిగిపోయాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా నాయకురాలు షేక్ మస్తాన్‌బీ, సీపీఎం నగర కార్యదర్శి కత్తి పద్మ, నగర అధ్యక్షురాలుఎ ఎన్వి సుబ్బమ్మ, ఐద్వా సభ్యులు కోరారు.

## జిల్లాలో కరువు ఛాయలు

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయని, వెంటనే కరువు నివారణకి తగు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఎం సీనియర్ నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు కోరారు. ఈనెల 22న నెల్లూరులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి పనులు పెంచాలన్నారు. నాయకులు మోహన్‌రావు, భాస్కరయ్య, కత్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాస్యతను పెంపొందించాలి

జిల్లాలో అక్షరాస్యతను పెంపొందించాలని అక్షరాంధ్ర డిప్యూటీ డైరెక్టర్ మల్లు మస్తాన్‌రెడ్డి అన్నారు. ఇటీవల నెల్లూరులోని డీఆర్‌డీఏ సమావేశమందిరంలో జరిగిన అక్షరాంధ్ర జిల్లాస్థాయి శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 94 వేల మందిని అక్షరాంధ్ర ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని, అక్షరాంధ్ర తరగతులు సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పీడీ వి.నాగరాజుకుమారి, జిల్లాలోని ఏపిఎంలు, సీసీలు వయోజన విద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాలూకి.. 25న 'స్వరార్చన'

ప్రపంచ ప్రఖ్యాత గాయకుడు, గానగంధర్వుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) 6వ వర్ధంతి సందర్భంగా ఈనెల 25న బాలూ పాటలతో 'స్వరార్చన' నిర్వహిస్తామని నిర్వాహకులు.. ప్రముఖ టీవీ ఆర్టిస్ట్-వ్యాఖ్యాత శింగంశెట్టి మురళీమోహన్‌రావు, 'స్వరార్చన' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.. ప్రముఖ గాయకుడు కూరపాటి నాగేంద్ర కుమార్‌లు తెలిపారు. నెల్లూరు, అన్నమయ్య సర్కిల్ సమీపంలోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద ఆ రోజు సాయంత్రం 6.30 నుండి రాత్రి 9.30 గంటల వరకు జరిగే ఈ సినీసంగీత విభావరిలో ప్రముఖ గాయనీమణులు శిరీష, స్వరూప తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. సంగీతప్రియులు, బాలూ అభిమానులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బీసీ భవన్ పనులు ప్రారంభం

నెల్లూరు, కొండాయపాలెం గేట్ సెంటర్‌లో బీసీ భవన్ నిర్మాణ పనులు ఎట్టకేలకు ఈనెల 22న ప్రారంభమయ్యాయి. ఇటీవలే జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బీసీ భవన్ నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించి, పనుల ప్రారంభానికి రంగం సిద్ధం చేశారు. మంగళవారం నాడు ఆ మేరకు జేసీబీతో ఆ ప్రదేశాన్నంతా చదును చేసేందుకు శ్రీకారం చుట్టారు. బీసీ భవన్ నిర్మాణానికి మంత్రి పొంగూరు నారాయణ, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు కోటి రూపాయల వంతున విరాళాలు ప్రకటించిన విషయం తెలిసిందే. 2017 ప్రాంతంలోనే పూర్తికావాల్సిన బీసీ భవన్ పునాదుల దశలోనే ఆగిపోవడంతో, కూటమి ప్రభుత్వం వచ్చాక దానికి కదలిక వచ్చింది. బీసీ భవన్ త్వరలోనే పూర్తికానుంది.

## నేనేమీ టైమ్ పాస్ కోసం.. రాజకీయాల్లోకి రాలేదు

### మంత్రి నారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన అబ్దుల్ అజీజ్

తాను టైమ్ పాస్ కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజాసేవే పరమావధిగా భావించి రాజకీయరంగంలోకి వచ్చానని మంత్రి నారాయణ తెలిపారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తాను పట్టించుకోనని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపైనే తన దృష్టి ఉంటుందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు, పలు పనులకు శంకుస్థాపనలు, భూమిపూజలు చేశారు. జాకీర్ హుస్సేన్ నగర్‌లో రూ.57.25 లక్షలతో ఆధునీకరించిన వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. జెండావీధిలోని పీఎన్ఎం హైస్కూల్, మున్సిపల్ ఉర్దూ పాఠశాలల ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. పొర్లుకట్టలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అదే ప్రాంతంలో రూ.90 లక్షలతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ పనులకు భూమిపూజ చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, నెల్లూరు సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పరంపర కొనసాగుతోందన్నారు. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు.

## జనసేన ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గునుకుల దంపతులు

ప్రజలకు జవాబుదారీతనం కలిగిన నాయకత్వాన్ని అందించాలనే లక్ష్యంతో జనసేన పార్టీ నాయకులు కిషోర్ గునుకుల, వీర మహిళ..ఏఎంసీ డైరెక్టర్ విజయలక్ష్మి గునుకుల ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని 16వ (21) డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌జీనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రజలను కలిసి స్థానిక సమస్యలు, డివిజన్ అభివృద్ధి, ప్రజలకు అందాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులను ఎన్నుకోవాలని కోరారు. జనసేన నాయకులు శారద, ప్రవల్లిక, విజయ, సుప్రియ, ప్రశాంత్ గౌడ్, నరహరి, బాలాజీ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్.. ప్రాణాలకి రక్షణ



ద్విచక్రవాహనదారులకి హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణాలకి రక్షణగా ఉంటుందని, ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పోలీసులు స్పష్టం చేశారు. జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఈనెల 21న నెల్లూరు నగరంలోని చిన్నబజారు, నవాబుపేట, సంతపేట, వేదాయపాళెం, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనదారులకు పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రత్యేక అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని చెప్పారు. ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, వైవీ సోమయ్య, కల్యాణ్‌రాజు, కోటేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## బీవీనగర్ రైల్వే గేటు మూత

నెల్లూరులోని బీవీనగర్ (భక్తవత్సలనగర్)లో ఉన్న రైల్వే లెవల్ క్రాసింగ్ గేటును ఈ నెల 25 నుంచి మూతవేస్తున్నారు. ఇక్కడ రైల్వే అండర్‌బ్రిడ్జి పనులు ప్రారంభం కానుండడంతో రైల్వే అధికారులు ఆమేరకు బోర్డును కూడా పెట్టారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు గేటు మూసివేయక తప్పదని, వాహనదారులు గమనించి ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వైసీపీ చర్యలు దారుణం

చట్టప్రకారం ఉద్యోగాల్లో నియమితులైన ఉపాధ్యాయులపై వైసీపీ అనుచిత వ్యాఖ్యలు, దాడులు దారుణమని నెల్లూరులోని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు తిరుమలయ్య, చెంచయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో ఇటీవల జరిగిన దాడులను వారు ప్రస్తావిస్తూ, ఉపాధ్యాయులపై భౌతికదాడులు చేయడం మంచిది కాదని, వైసీపీ ప్రవర్తన ఉద్యోగుల్లో భయాందోళనలు కలిగిస్తోందని అన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నవారిపై కఠినచర్యలు తీసుకుని, ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యం నింపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## చేనేత సంఘాల వినతి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత కారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి సహకరించాలంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు ఈనెల 22న వినతిపత్రం సమర్పించారు. చేనేతకారుల రాష్ట్ర కమిటీ సభ్యులు పముజుల హరి మాట్లాడుతూ, చేనేతసంఘాలకు ఎన్నికలు జరిపించి, ఆప్కోను క్రమబద్ధం చేయాలని, చేనేతసంఘాలకు రావాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరారు. మునగాల వెంకటేశ్వర్లు, బి.ప్రభాకర్, జె.వెంకటేశ్వర్లు, బొమ్మన శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలను తెరవండి

విద్యుత్ బస్సుల నిర్వహణ పేరుతో మూసేసిన నాలుగు ఆర్టీసీ డిపోలను వెంటనే తెరవాలంటూ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు డిమాండ్ చేశారు. ఈనెల 22న నెల్లూరులోని డా.జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఆ సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా బస్సులను నడిపే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. నరసయ్య, నారాయణరావు, శంకరరావు, రవికుమార్, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పదవులు కాదు..ప్రజాసేవే ముఖ్యం!

## రాజకీయం కంటే..రాజ్యాంగ విలువలే ప్రధానం - మంత్రి ఆనం


మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి ఆనం, పరిషత్ సభ్యులు

ప్రజాస్వామ్యంలో పదవులు ఎవరికీ శాశ్వతం కావని, రాజ్యాంగం నిర్దేశించిన కాలపరిమితి పూర్తయిన తర్వాత ప్రతి ఒక్కరూ పదవుల నుంచి వైదొలగాల్సిందేనని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశానికి హాజరైన మంత్రి, మండల పరిషత్ సభ్యులను అభినందిస్తూ, ఐదేళ్ల పదవీకాలంలో ప్రజలకు అందించిన సేవలను ప్రశంసించారు. ఆత్మకూరు మండలంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ ప్రజాసేవ, ప్రజల పట్ల బాధ్యత, రాజ్యాంగ విలువలు శాశ్వతంగా నిలవాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థలను రద్దుచేసి తమకు అనుకూలంగా వ్యవహరించే అవకాశం ఉన్నప్పటికీ, అటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలను గౌరవిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. రాజ్యాంగ విలువలను కాపాడడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి తెలిపారు.

### అన్నిటినీ రాజకీయకోణంలో చూడకూడదు :

ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య చివరి సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరుకాలేదంటూ ప్రతిపక్ష నేతలు చేసిన విమర్శలపై మంత్రి ఆనం స్పందించారు. స్థానిక సంస్థల సమావేశాలకు రాలేదని.. దానిని కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించడం సరికాదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశాలకు హాజరయ్యే అంశాన్ని రాజకీయ కోణంలో చూడటం కంటే ప్రజా సమస్యలపై చర్చకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మైక్ దొరికింది కదా అని విజ్ఞత లేకుండా మాట్లాడటం రాజకీయ హుందాతనం కాదని మంత్రి అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ నిర్ణయాన్ని వెల్లడిస్తారని, ప్రజల తీర్పును ప్రతిఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని మంత్రి ఆనం స్పష్టం చేశారు.

# ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం

## • మంత్రి నారాయణ..ఎంపీ విపిఆర్


ప్రమాణస్వీకారం చేస్తున్న జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఆర్యవైశ్యులు సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయమని మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలు అభినందించారు. ఇటీవల నెల్లూరులోని 6వ డివిజన్ పప్పుల వీధి శ్రీ మహాలక్ష్మి అమ్మవారి గుడి వద్ద శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం జరిగింది. మంత్రి నారాయణతో పాటు ఎంపీ వేమిరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు..రాష్ట్ర ఆర్యవైశ్య గౌరవ ఛైర్మెన్ టీజీ వెంకటేష్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అక్షయ్ తదితరులు పాల్గొని, ప్రమాణస్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మునగా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కోట రమేష్‌బాబు, కోశాధికారి చలపతిరావు, మహిళా విభాగ అధ్యక్షురాలు శేషాద్రి సువర్ణకుమారి, యువజన విభాగ అధ్యక్షులు వేముల హరిశంకర్‌లతో పాటు 100మందికి పైగా సభ్యులతో ఏర్పాటైన ఈ భారీ కమిటీ సంఘ ఐక్యతకు నిదర్శనమని మంత్రి నారాయణ కొనియాడారు. పేదల చదువులకు సాయం, కోవిడ్ సమయం నుండి నిత్య అన్నదానాల వరకు ఆర్యవైశ్యులు అందిస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమన్నారు. ఆర్యవైశ్యుల పెద్దదిక్కుగా ఉంటూ వారి సంక్షేమానికి టీజీ వెంకటేష్ చేస్తున్న కృషి అపారమని, ఆయనంటే తనకెంతో గౌరవమని విపిఆర్ తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరం ఆర్యవైశ్యులను గౌరవించుకోవాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి సూచించారు.

# టెన్త్ టాపర్లకు.. 'కళాచిత్ర' పురస్కారాలు

## • శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి చేతులమీదుగా బహుమతులు


విద్యార్థులని సన్మానిస్తున్న శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి, పక్కన ఉమామహేశ్వరరావు

సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో ఉన్న ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఇటీవల 'కళాచిత్ర' పురస్కారాలను శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతులమీదుగా అందజేశారు. స్వర్గీయ ఆర్ఎం ఆంజనేయులు, ఆర్ఎం ప్రకాష్‌బాబు కుటుంబసభ్యులు ప్రతి ఏటా నిర్వహించే కళాచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన కొండా యువశంకర్‌కు 'కళాచిత్ర' పురస్కారంతో పాటు, 25 వేల రూపాయిల నగదును ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన ఉచ్చూరు అంజలికి కళాచిత్ర పురస్కారం.. 15వేలు నగదును, తృతీయస్థానం సాధించిన ఇంటూరు మాధురికి పురస్కారంతో పాటు 10వేల నగదు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ నేటి కాలంలో ఐటీఐ, పాలిటెక్నిక్ చదివే వారికి మంచి భవిష్యత్ ఉంటుందని, శ్రీసిటీ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం, రవీంద్ర సన్నారెడ్డిని కళాచిత్ర పురస్కారాల నిర్వాహకులు ఆర్ఎంవి భాస్కర్‌బాబు, ఆర్ఎం ఉమామహేశ్వర్‌రావు సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారిణి కెఎంఎస్ సునీలా, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ జ్యోతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సమస్యకు..

# త్వరలోనే శాశ్వత పరిష్కారం

మంత్రి నారాయణ


దొంతాలి డంపింగ్‌యార్డ్‌ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో ఆంధ్రప్రదేశ్‌ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ చెప్పారు. నెల్లూరు రూరల్ పరిధిలోని దొంతాలి డంపింగ్ యార్డును అదివారం ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న చెత్త ప్రాసెసింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం చెత్త నిర్వహణలో పూర్తిగా విఫలమైందని, ప్రజలపై చెత్తపన్ను వేసి, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 153 లక్షల టన్నుల చెత్తను కుప్పలుగా వదిలి వెళ్లిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో గత ఏడాది అక్టోబర్ 2 నాటికి 85 లక్షల టన్నుల చెత్తను తొలగించామని తెలిపారు. దొంతాళిలో ప్లాంట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత 100 కిలోమీటర్ల పరిధిలోని చెత్తను రోజువారీగా సేకరించి అదే రోజు బర్న్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానం అమల్లోకి వస్తుందని తెలిపారు. నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో..

# జెన్‌జీలకి సీట్లు

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి సంచలనాత్మక నిర్ణయం



జెన్‌జీ యువత కోసం కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసేందుకు నాలుగు సీట్లు కేటాయిస్తామంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇటీవల సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారు. కేవలం మాటలు-ఉపన్యాసాలు చెప్పడంతో సరిపెట్టుకోక, ఆచరణలోనూ తమ చిత్తశుద్ధిని చూపే ఎమ్మెల్యే కోటంరెడ్డి తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు ప్రజల్లో సంతోషాన్ని కలిగిస్తున్నాయి కూడా. ప్రజల కోసం పనిచేయాలన్న తపన, రాజకీయ ఆసక్తి, ప్రజా సమస్యలపై అవగాహన, అనర్గళంగా మాట్లాడే జెన్‌జీ యువతకి రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందని కూడా ఆయన చెప్పున్నారు. కార్పొరేషన్ ఎన్నికలకు మరో నెల రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ ఉన్న నేపథ్యంలో శ్రీధర్‌రెడ్డి నిర్ణయం రాజకీయవర్గాల్లోనూ కలకలం సృష్టిస్తోంది. ఇప్పటివరకు ఆయన జెన్ జీ పేరుతో వేలాది మంది యువతతో మమేకమై, వారి అభిప్రాయలు ఆశలు.. ఆకాంక్షలు తెలుసకుంటున్న సంగతి తెలిసిందే. తాజాగా కార్పొరేషన్ ఎన్నికల్లో రూరల్‌కు సంబంధించిన మొత్తం 36 సీట్లలో సమర్థవంతమైన జెన్ జీ యువత దొరికితే..నాలుగు సీట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నాలుగు సీట్లకు సంబంధించి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కనీస పార్టీ ఎన్నికల ఖర్చును ఆయన స్వయంగా భరించనున్నారు కూడా. రాజకీయాల్లో జెన్ జీ యువతను ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే కోటంరెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.




# భావజ్ఞానం : మనసును అర్థం చేసుకునే మానవీయ శక్తి

మనిషి జీవితంలో భావాలు అనేవి కనిపించని ప్రవాహాలు. అవి మన మాటల్లో, మన చర్యల్లో, మన నిర్ణయాల్లో, మన సంబంధాల్లో నిశ్శబ్దంగా ప్రవహిస్తుంటాయి. భావాలను అర్థం చేసుకోవడం, వాటిని నియంత్రించడం, వాటిని సానుకూల దిశగా మలచడం..ఇవన్నీ కలిపిన శక్తినే భావజ్ఞానం (ఎమోషనల్ ఇంటెలిజెన్స్) అంటారు. ఇది కేవలం ఒక నైపుణ్యం కాదు. ఇది మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అంతర్ముఖ శక్తి. యువతకు ఈ నైపుణ్యం అత్యంత అవసరం, ఎందుకంటే వారు జీవితంలో అవకాశాలను నిర్మించే దశలో ఉన్నారు. ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి భావజ్ఞానం ఒక మార్గదర్శి. భావజ్ఞానం అంటే మనసును అర్థం చేసుకోవడం. మనలో ఏ భావం ఎప్పుడు వస్తుంది, ఎందుకు వస్తుంది, దాన్ని ఎలా నియంత్రించాలి..ఈ అవగాహన మన జీవితాన్ని మార్చగలదు. ఒక యువకుడు కోపం వచ్చినప్పుడు వెంటనే స్పందిస్తే సమస్య పెరుగుతుంది. కానీ అదే యువకుడు తన కోపాన్ని గుర్తించి, రెండు నిమిషాలు ఆలోచించి స్పందిస్తే, సమస్య చిన్నదవుతుంది. భావజ్ఞానం అనేది భావాలను అణచివేయడం కాదు. వాటిని అర్థం చేసుకుని సరైన దిశలో నడిపించడం.

భావజ్ఞానం మన సంబంధాలను బలపరుస్తుంది. మనం ఎలా మాట్లాడతాం, ఎలా స్పందిస్తాం, ఎలా వింటాం..ఇవన్నీ మన సంబంధాల నాణ్యతను నిర్ణయిస్తాయి. ఒక యువతి తన స్నేహితురాలు బాధలోఉన్నప్పుడు ఆమె మాటలను శ్రద్ధగా వింటే, ఆ స్నేహం మరింత బలపడుతుంది. ఒక విద్యార్థి తన ఉపాధ్యాయుడి సూచనలను గౌరవంగా స్వీకరిస్తే, అతని అభివృద్ధి వేగంగా జరుగుతుంది. భావజ్ఞానం అనేది సంబంధాలను నిర్మించే మానవీయ శక్తి. మనసును అర్థం చేసుకోవడం ద్వారా మనం మనుషులను అర్థం చేసుకోవడం నేర్చుకుంటాం. భావజ్ఞానం మన నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. భావోద్వేగం ఉన్నప్పుడు తీసుకునే నిర్ణయాలు చాలా సార్లు తప్పుతాయి. కానీ, భావజ్ఞానం ఉన్నవారు భావం మరియు బుద్ధి మధ్య సమతుల్యతను సాధిస్తారు. ఒక యువకుడు ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు భయం సహజం. కానీ భావజ్ఞానం ఉన్నవాడు ఆ భయాన్ని గుర్తించి, దాన్ని ఆత్మవిశ్వాసంగా మార్చుకుంటాడు. "భయం అనేది మనసులోని సందేహం; ధైర్యం అనేది మనసులోని స్పష్టత" అనే మాట భావజ్ఞానానికి మార్గదర్శకం.

**వ్యక్తిత్వాన్ని వెలిగించే దీపం..భావజ్ఞానమే :**

భావజ్ఞానం అంటే వినడం కూడా. వినడం అనేది గౌరవం. వినడం అనేది అనుబంధం. వినడం అనేది మనసును తెరవడం. ఒక ప్రసంగీకుడు ప్రేక్షకుల ముఖాల్లోని భావాన్ని గమనిస్తే, తన మాటలను తగిన విధంగా మార్చుకోగలడు. ఒక యువతి తన తల్లిదండ్రుల మాటలను శ్రద్ధగావింటే, ఆమె నిర్ణయాలు మరింత పరిపక్వంగా మారుతాయి. వినడం అనేది భావజ్ఞానంలో అత్యంత శక్తివంతమైన భాగం. మనం వినడం నేర్చుకుంటే, మనం అర్థం చేసుకోవడం కూడా నేర్చుకుంటాం. భావజ్ఞానం మన వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తుంది.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

మనం ఎలా స్పందిస్తాం, ఎలా ఆలోచిస్తాం, ఎలా మాట్లాడతాం..ఇవన్నీ మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. ఒక యువకుడు తన తప్పును అంగీకరించగలిగితే, అతని వ్యక్తిత్వం బలపడుతుంది. ఒక యువతి తన విజయాన్ని వినయంతో స్వీకరించగలిగితే, ఆమె వ్యక్తిత్వం మెరుస్తుంది. భావజ్ఞానం అనేది మన వ్యక్తిత్వాన్ని లోపల నుంచి వెలిగించే దీపం. ఆ దీపం వెలిగితే మన మాటల్లో, మన చర్యల్లో, మన నిర్ణయాల్లో వెలుగు కనిపిస్తుంది.

**నాయకత్వ లక్షణాలను పెంచుతుంది:**

అంతేకాదు, భావజ్ఞానం మన నాయకత్వాన్ని పెంచుతుంది. నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు; మనుషులను అర్థం చేసుకోవడం. ఒక నాయకుడు తన బృందంలోని సభ్యుల భావాలను అర్థం చేసుకుంటే, వారి పనితీరు మెరుగుపడుతుంది. ఒక యువ నాయకుడు తన టీమ్‌లోని సభ్యుడు బాధలో ఉన్నప్పుడు అతనికి ధైర్యం చెప్పగలిగితే, ఆ టీమ్ బలపడుతుంది. భావజ్ఞానం మన సమస్యలను పరిష్కరించే శక్తి. ఒక సమస్యను కోపంతో, ఆవేశంతో, తొందరపడి మాట్లాడితే అది మరింత పెద్దదవుతుంది. కానీ అదే సమస్యను శాంతంగా, స్పష్టంగా, భావజ్ఞానంతో మాట్లాడితే అది చాలా చిన్నదవుతుంది. ఒక యువకుడు తన స్నేహితుడితో జరిగిన చిన్న అపార్థాన్ని భావజ్ఞానంతో పరిష్కరించగలిగితే, ఆ స్నేహం మరింత బలపడుతుంది. భావజ్ఞానం అనేది సమస్యలను చిన్నదిగా మార్చే మానవీయ శక్తిగా మనం గుర్తించాలి. ఇక్కడ ఒక చిన్న కథను గుర్తు చేసుకుందాం. ఒక విద్యార్థి తరగతి గదిలో తన ప్రాజెక్ట్‌పై విమర్శలు వచ్చినప్పుడు చాలా బాధపడ్డాడు. మొదట అతను కోపంతో స్పందించబోయాడు. కానీ రెండు నిమిషాలు ఆలోచించి, తన భావాన్ని గుర్తించాడు. తన గురువు చెప్పిన మాటలను శ్రద్ధగా విని, తన ప్రాజెక్ట్‌ను మెరుగుపరచాడు. ఆ తర్వాత వచ్చిన ఫలితం అతనికి ఆశ్చర్యం కలిగించింది. అతని ప్రాజెక్ట్ ఉత్తమంగా ఎంపికైంది. ఆ రోజు అతను గ్రహించాడు..'భావజ్ఞానం అనేది మన భావాలను అర్థంచేసుకుని, వాటిని సానుకూల దిశగా మలచే శక్తి'..అని!...

**సాధనతో భావజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి :**

భావజ్ఞానం అనేది సాధనతో పెరుగుతుంది. ప్రతిరోజూ కొద్దిగా చదవడం, మంచి ప్రసంగాలు వినడం, మంచి రచనలు ఆస్వాదించడం, చిన్న చిన్న చర్చల్లో పాల్గొనడం..ఇవన్నీమన భావజ్ఞానాన్నిపెంచుతాయి. ఒక యువకుడు ప్రతిరోజూ తన భావాలను ఒకచిన్న నోటుపుస్తకంలో రాస్తే, అతని మనసు స్పష్టంగా మారుతుంది. ఒక యువతి ప్రతిరోజూ 5 నిమిషాలు ధ్యానం చేస్తే, ఆమె భావాలు సమతుల్యంగా మారుతాయి. "సాధనతోనే శక్తి" అనే మాట భావజ్ఞానానికి కూడా వర్తిస్తుంది. చివరగా, భావజ్ఞానం యువతకు జీవితాంతం ఉపయోగపడే ఆస్తి. ఈ నైపుణ్యం వారి విద్యలో, ఉద్యోగంలో, సంబంధాల్లో, నాయకత్వంలో..ప్రతిచోట ప్రభావం చూపుతుంది. భావజ్ఞానం ఉన్నవారు తమ భావాలను అర్థంచేసుకుంటారు, ఇతరుల భావాలను గౌరవిస్తారు, సమస్యలను పరిష్కరిస్తారు, సంబంధాలను నిర్మిస్తారు, వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తారు. భావజ్ఞానం అనేది కేవలం ఒక నైపుణ్యం కాదు..అది మనసును అర్థంచేసుకునే మానవీయ శక్తి. ఆశక్తినివెలిగించుకోవడం యువత చేతుల్లోనే ఉంది.



**వచ్చే వారం :** తిరస్కరణలో దాగిన అవకాశం: విఫలతను విజయంగా మలిచే జీవనశక్తి!

E-mail: reddyu@gmail.com

---

## మంత్రి నారాయణపై..

# లేనిపోని విమర్శలు చేస్తే సహించం



• కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

పేదల కోసం పనిచేస్తున్న మంత్రి నారాయణపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఆయన ఘాటుగా కౌంటర్ ఇచ్చారు.నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడండి, అవాకులు, చెవాకులు పేలడం మానకపోతే ప్రజలే బుద్ది చెబుతారంటూ హెచ్చరించారు. వైఎస్ఆర్సీపీలో తన పదవిని కాపాడుకునేందుకే చంద్రశేఖర్‌రెడ్డి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. చెత్తపై పన్ను వసూలు చేసిన ఘనత వైసీపీదే నన్నారు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు.మంత్రి నారాయణ వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతుంటే ఓర్వలేక విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. వైసీపీ హయాంలో ప్రతి పనికి 50శాతం కమీషన్లు తీసుకునేవారని, అదే విధానం ఇప్పుడు కూడా ఉంటుందని అనుకోవడం పొరపాటని గిరిధర్‌రెడ్డి అన్నారు. మంత్రి నారాయణపై ఆరోపణలు చేసే ముందు అవి ప్రజలు నమ్ముతారా లేదా అన్నది ఆలోచించుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు మానుకుని వాస్తవాలు మాట్లాడాలని హితవు పలికారు.త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఎవరి పనితీరును ఎలా అంచనా వేస్తారో ఫలితాల్లో తెలుస్తుందని అన్నారు.

# బియ్యం ధరలను నియంత్రించండి

• బీజేపీ నాయకుడు మిడతల రమేష్

బియ్యం ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈనెల 21న బీజేపీ నాయకుడు మిడతల రమేష్ నెల్లూరులోని పౌరసరఫరాలశాఖ అధికారిణి మానసకి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో పండిన బీపీటీ రకం బియ్యాన్ని ప్రభుత్వం తరలించకపోవడంతో ధరలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం నెల్లూరులో సూపర్‌ఫైన్ బియ్యాన్ని తీసుకుని, నాసిరకం బియ్యాన్ని రేషన్ దుకాణాలకు పంపుతోందని ఆయన ఆరోపించారు. నెల్లూరుజిల్లాలో పండిన మేలురకం ధాన్యాన్ని ఇతర జిల్లాలకి తరలిస్తుండడం వల్ల, ఈ జిల్లాలో ఆ ధాన్యం అందుబాటులో లేక ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, ధరల నియంత్రణలో అధికారయంత్రాంగం విఫలమైందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాసులు, నాగేంద్రసింగ్, ఆదినారాయణ, సుజన, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

# 1న..జిల్లాస్థాయి డ్రాయింగ్, క్విజ్ పోటీలు

నెల్లూరు సమీపంలోని పల్లిపాడులో ఉన్న ప్రభుత్వ విద్యాసంస్థ డైట్‌లో అక్టోబర్ 1న సేవా సంకల్ప్ అభియాన్ జిల్లా స్థాయి చిత్ర లేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి, డైట్ అదనపు ప్రిన్సిపాల్ డా.ఆర్ బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. వికసిత్ భారత్ -2047, గత 25 సంవత్సరాలలో సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ప్రజాసేవ ప్రయాణం, జాతి నిర్మాణం పట్ల విద్యార్థులలో దాగివున్న ఉద్దేశ్యాలు, సృజనాత్మకత,ఆశయాలను వెలికితీయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖలు, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ప్రభుత్వ డైట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర మరియు

**డీఇఓ డా. బాలాజీరావు**

జాతీయ స్థాయిలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల నుండి 6వ తరగతి నుండి 12వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. డ్రాయింగ్ 2 కేటగిరీలలో (10-13 మరియు 14-18 సంవత్సరాలు) వక్తృత్వ విభాగం 3 కేటగిరీలలో (6-8,9-10 మరియు 11-12 తరగతులు) పోటీలు జరుగుతాయని తెలిపారు. పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 22,23న, మండల స్థాయిలో సెప్టెంబర్ 28న పోటీలు నిర్వహించి, ప్రతి కేటగిరీలో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని జిల్లా స్థాయిలో పాల్గొనేలా చూడాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలు అక్టోబర్ 9న అమరావతిలో జరుగుతాయని పేర్కొన్నారు. డ్రాయింగ్ అంశం '25 కోట్ల భారతదేశ పిల్లల కలలు' అని,' ప్రసంగ అంశం-వికసిత్ భారత్ ఏ2047' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలకు ఎస్కె ఖాజారసూల్, సీనియర్ లెక్చరర్‌ను ఫోన్ (96526 06878)లో సంప్రదించవలసినదిగా ఆయన సూచించారు.

## బీసీభవన్‌కి..

# సావిత్రిబాయి పేరు పెట్టాలి

నెల్లూరులో నిర్మాణంలో ఉన్న బీసీ భవన్‌కి మహాత్మా జ్యోతిరావు పూలే సతీమణి.. సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే పేరు పెట్టాలని భారత చైతన్య యోజన (బీసీవై) పార్టీ నేత బుధవారపు బాలాజీ ఈనెల 21న నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌డేలో కలెక్టర్ హిమాన్షు శుక్లకి వినతిపత్రం సమర్పించారు. దేశంలో మహిళల విద్యాభ్యున్నతికి బాటలు వేసిన మహనీయురాలు జ్యోతిరావు పూలే అని, బీసీభవన్‌కి ఆమె పేరును నామకరణం చేయడం సముచితంగా ఉంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎస్ఎస్ యాదవ్, సోమగోపాల్, నాగేంద్ర, యనమల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా పిల్లల కోసం.. రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న బాలాజీ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిబ్బంది

నెల్లూరులోని బాలాజీ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ సంస్థ 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో తలసేమియా పిల్లల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, తలసేమియా పిల్లలకు క్రమం తప్పనిసరిగా రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. సమయానికి రక్తం అందించి వారి ప్రాణాలను కాపాడటంలో రక్తదాతల పాత్ర అత్యంత కీలకమైనదని తెలిపారు. తమ సంస్థ 35వ వార్షికోత్సవాన్ని ఇలాంటి ఒక మంచి సేవా కార్యక్రమంతో జరుపుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.ఈ సందర్భంగా ఆ సంస్థ సిబ్బందితో పాటు పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ అడహాక్ కమిటీ సభ్యులు యాలమూరి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించని..

# ఇసుక వాహనాలపై చర్యలు



ఇసుక ట్రాక్టర్‌ని పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇసుక వాహనాలు నిబంధనలను తప్పకుండా పాటించాలని, పట్టలు కప్పకుండా ఇష్టం వచ్చినట్లు ఇసుకను తీసుకువెళ్ళడం ప్రజలకి ఇబ్బందికరమని కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్ ఇసుక వాహనదారులను హెచ్చరించారు. నిబంధనలు పాటించకుంటే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 22న ఆయన నగరంలోని మినీ బైపాస్‌రోడ్డు ప్రాంతంలో సరిగా పట్టలు కప్పకుండా ఇసుకను తీసుకువెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను గమనించి, దానిని నిలిపివేశారు. పూర్తిగా పట్టలు కప్పినతర్వాతనే ఆ వాహనాన్ని వదిలిపెట్టారు. ఇసుక, కంకర తదితరాలను తీసుకువెళ్ళేటప్పుడు భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు.

## ఆస్తిపన్ను వసూళ్ళపై శ్రద్ధ చూపాలి

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తిపన్నుల వసూళ్లపై అధికారులు శ్రద్ధ చూపాలని కమిషనర్ వైఓ నందన్ సూచించారు. ఈనెల 22న కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిర్దేశిత లక్ష్యాల సాధనకు అందరూ కృషిచేయాలన్నారు. కార్యదర్శులందరూ ప్రతిరోజూ సచివాలయాల పరిధిలో కొత్తగా కట్టిన భవనాలు,అదనపు అంతస్తుల నిర్మాణభవనాలు, కమర్షియల్ భవనాలను గుర్తించి,వాటిని ఆస్తిపన్ను పరిధిలోకి తేవాలని స్పష్టం చేశారు.




# ఎన్‌బికేఆర్‌లో.. ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ)లో ఇటీవల 2 –ఆంధ్ర ఇఎంఇ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల ఎన్‌సీసీ నమోదు మరియు ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. లెఫ్టినెంట్ కల్నల్ ఎన్. దినేష్, సేనా మెడల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలో మొత్తం 135 మంది విద్యార్థులు పాల్గొనగా, 20మంది బాలురు, 15మంది బాలికలు, మొత్తం 35 మంది విద్యార్థులు ఎన్‌సీసీకి ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐక్యత, జాతీయత, దేశభక్తి వంటి విలువలను పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎన్‌సీసీ ఒక అద్భుతమైన వేదిక అని, ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులు కేవలం వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణను మాత్రమే కాకుండా, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక యుగంలో భారత సాయుధ దళాల్లో చేరేందుకు కూడా అనేక అవకాశాలను పొందవచ్చని లెఫ్టినెంట్ కల్నల్ దినేష్ వివరించారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డా. జి.మాధవయ్య పర్యవేక్షించారు.

# కావలిని కరువు ప్రాంతంగా ప్రకటించాలి

**● బీజేపీ నాయకుల వినతి**



కావలి డివిజన్‌ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ ఈనెల 21న బీజేపీ నాయకులు కె.బ్రహ్మానందం ఆధ్వర్యంలో కావలి ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓకి వినతిపత్రం అందజేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం ఏర్పడి చెరువులు దొరువులన్నీ ఎండిపోయాయని, సమయానికి సాగునీరందక పొలాలు ఎండిపోతున్నాయని వారు ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద కిరణ్‌కుమార్, బీజేపీ యువమోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

### డప్పు కళాకారుల

# పింఛన్ల పరిశీలన

కోవూరు సహాయ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని అయిదు మండలాలకి సంబంధించి డప్పు కళాకారులు పంపుకున్న సుమారు 160 పింఛను దరఖాస్తులను ఈనెల 21న ఏఎన్‌డబ్ల్యుఓ తిరుపతయ్య పరిశీలించారు. కళాకారుల కళా నైపుణ్యాన్ని స్వయంగా తిలకించారు. సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

### రాష్ట్రంలో ఏం జరుగుతోందో..

# విద్యార్థులు తెలుసుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. పాశిం సునీల్

గూడూరు పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఇటీవల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదువుకొని ఈరోజు ఎమ్మెల్యే స్థాయిలో ఉండడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో విద్యార్థిని విద్యార్థులు అందరూ తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16 వేల 500 వందల టీచర్ పోస్టులు ఇవ్వడం జరిగిందని, దీనిపై ప్రతిపక్ష వైసిపి అసత్య ప్రచారాలు చేస్తూ కోర్టుకు వెళ్లిందని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగం కల్పిస్తే వారిని తొలగించాలని ప్రచారం చేస్తున్నాయని, పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. కళాశాల అధ్యాపకులు కిరణ్మయి, నాయకులు బిల్లు చెంచురామయ్య శివకుమార్, రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

# హెల్మెట్‌పై అవగాహన



వాహనదారులకి అవగాహన కల్పిస్తున్న ఎస్.ఐ తిరుపతయ్య

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని గూడూరు రూరల్ ఎస్.ఐ తిరుపతయ్య పేర్కొన్నారు. ఈ నెల 21వతేదీ గూడూరు మండల పరిధిలోని పోటుపాలెం కూడలి వద్ద వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుండి బయటపడేందుకు హెల్మెట్ ఏ విధంగా ఉపయోగపడుతుందో వాహనదారులకు అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రంగనాథునికి చిత్రకూట ఉత్సవం



ఉత్సవ విగ్రహాలకి పూజలు నిర్వహిస్తున్న యరగుడిపాటి వంశస్తులు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి తూర్పు రాజగోపుర నిర్మాత యరగుడిపాటి వెంకటాచలం పంతులు పుణ్య జన్మతిథిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం భాద్రపద శుక్లపక్ష అష్టమి నాడు యరగుడిపాటి వంశస్తులు చిత్రకూట ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ నెల 19వ తేదీ రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను గూడూరు నుండి వచ్చిన యరగుడిపాటి వంశీయులు చిత్రకూటమిలోకి వేంచేసి పూజలు చేసి, తిరిగి రంగనాథస్వామి ఆలయంలోకి యథావిధిగా చేర్చారు. ఈ ఉత్సవంలో యరగుడిపాటి వంశస్తులు గోపాలరావు, భాస్కరరావు, నాగేశ్వరరావు, పట్టాభిలతో పాటు మల్లు విజయకుమార్‌రెడ్డి, రమణారెడ్డి, రామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, భాస్కరరెడ్డి, రమేష్‌రెడ్డి, నాశిన నాగులు, గోవర్ధన్, మధు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు కూరగాయల పంపిణీ



దివ్యాంగులకి కూరగయాలు, గుడ్లు పంపిణీ చేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఇటీవల జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుర్రం విజయ్‌బాబు దాతృత్వంలో దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ఇక్షిత, బిల్లు సాయిపల్లవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

**● వైసీపీ ఇన్‌ఛార్జి బూదూరు గురవయ్య**

గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో ఇటీవల వై.సి.పి.పట్టణ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు వైసీపీ ఇన్‌ఛార్జ్ బూదూరు గురవయ్య పాల్గొని మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలకు గుర్తింపు కార్డులు ఇస్తున్నామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపు తథ్యమని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తకి వైసీపీ అండగా ఉంటుందన్నారు. నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, నాసిన నాగులు, సుభాన్, మగ్దూమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.కె.ఆర్‌లో స్వచ్ఛ ఆంధ్ర



'స్వచ్ఛ ఆంధ్ర' ప్రతిజ్ఞ చేస్తున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు

'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఎస్.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రత్యేక అవగాహన పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్య మేధో వికాసానికి ఎంతగానో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. అనంతరం ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు కలిసి కళాశాల క్యాంపస్‌లో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి, 'స్వచ్ఛ ఆంధ్ర' ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.రామ్‌ప్రసాద్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఎస్.ఏ.ఎస్.ఏ కో–ఆర్డినేటర్ డా. ఎ.వి.ప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# త్వరలోనే షాదీమంజిల్ నిర్మాణాలు

## - - - కోటంరెడ్డి సోదరుల వెల్లడి - - -



షాదీమంజిల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కోటంరెడ్డి సోదరులు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ముస్లిం సోదరుల చిరకాల కోరిక అయిన షాదీమంజిల్ నిర్మాణపనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డిలు ఇటీవల శంకుస్థాపన చేశారు. 70 లక్షల రూపాయలతో షాదీమంజిల్ నిర్మాణం జరుగుతుందని, త్వరలోనే నిర్మాణాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశీస్సులతో, మంత్రి నారాయణ సహకారంతో 1వ డివిజన్, 2వ డివిజన్‌లలో షాదీమంజిల్ నిర్మాణాలను పూర్తిచేస్తామన్నారు. మరో 80 లక్షల రూపాయల నిధులకు కూడా ప్రయత్నం చేస్తున్నామని, ఆ ప్రయత్నాలు ఫలిస్తే జన్నత్ హుస్సేన్‌నగర్‌లో 1వ ఫ్లోర్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుడతామని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చెప్పారు. రూరల్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికలప్పుడు తామిచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని ఆయన అంటూ, అతిత్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, ప్రజలు ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటు వేస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ప్రజలందరూ మంచి ఆలోచన చేసి కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని అన్నారు. నెల్లూరు ఏఎంసీ చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సాబీర్ ఖాన్, కో క్లస్టర్ ఇంచార్జ్ మనుబోలు రామ్మోహన్‌రెడ్డి, 2వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మేకల అనిల్, టీడీపీ నాయకులు నెల్లూరు పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రత్యేక కార్యదర్శికి సన్మానం :



నెల్లూరు రూరల్ ఆమంచర్ల వద్ద 500 ఎకరాలలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు కోటంరెడ్డి సోదరులు చేస్తున్న ప్రయత్నాలు ఫలింపునకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమంచర్లలో పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి ఇటీవల స్థల పరిశీలనకోసం వచ్చిన రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి యువరాజ్‌ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శాలువాతో సత్కరించారు.

## ఎనెల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో

# 'అల్జీమర్స్'పై అవగాహన



'అల్జీమర్స్'పై అవగాహన కల్పిస్తున్న 'ఎనెల్' ఆసుపత్రి వైద్యులు

ప్రపంచ అల్జీమర్స్ డే సందర్భంగా ఈనెల 21న నెల్లూరులోని ఎనెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డా. కె.లావణ్య అల్జీమర్స్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. అల్జీమర్స్ వ్యాధి ముఖ్యంగా వయస్సు పెరిగేకొద్దీ ఎక్కువగా కనిపిస్తుంటుందని, తరచుగా మతిమరుపు ఉండడం, ఇటీవల జరిగిన విషయాలను కూడా గుర్తుంచుకోలేకపోవడం, వస్తువులను ఎక్కడ పెట్టారో తెలియకపోవడం వంటి ఇబ్బందులతో అల్జీమర్స్ వ్యాధి గ్రస్తులు సతమతమవుతుంటారని ఆమె తెలిపారు. అయితే ఈ సమస్య పట్ల నిర్లక్ష్యంగా ఉండక వైద్యనిపుణుల సూచనలతో తగు చికిత్సలు చేసుకోవడం మంచిదని చెప్పారు. పరిచయమైన ప్రదేశాల్లో దారి తప్పడం, మాట్లాడేటప్పుడు సరైన పదాలు గుర్తుకు రాకపోవడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది, రోజువారీ పనులు చేయడంలో సమస్యలు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని డా. లావణ్య సూచించారు. ఎనెల్ హాస్పిటల్ చైర్మన్ కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ డా. కె.నాగేంద్ర, మెడికల్ సూపరింటెండెంట్ డా. జి.ప్రణీత్, మార్కెటింగ్ హెడ్ రామచంద్రరావు పాల్గొన్నారు. తొలుత ఈ వ్యాధిపట్ల అవగాహన వాక్‌ను నిర్వహించారు.

## రాజరాజేశ్వరమ్మ గుడికి..

# కొత్త ఇఓ



బాధ్యతలు చేపట్టిన శ్రీధర్‌నాయుడు

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానానికి కొత్త కార్యనిర్వహణాధికారిగా నూతలపాటి శ్రీధర్‌నాయుడు నియమితులయ్యారు. జిల్లాలోని పూడిపర్తిలో ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం ఇఓగా ఉన్న ఆయన్ను, తాజాగా రాజరాజేశ్వరమ్మ దేవాలయానికి అదనపు ఇఓగా బాధ్యతలు కేటాయిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. శ్రీధర్‌నాయుడు ఈనెల 24వ తేదీ గురువారం ఉదయం రాజరాజేశ్వరమ్మ దేవాలయంలో ఆ బాధ్యతలను స్వీకరించారు. ఆలయ ఛైర్‌పర్సన్ ఏలూరు శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా..

# వేదాంతదేశికర్ ఉత్సవాలు

నెల్లూరు స్థానిక రంగనాథస్వామి వారి దేవస్థానం వద్దనున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం.. శ్రీ వేదాంత దేశికర్ దేవస్థానంలలో ఇటీవల విశేష పూజలు సేవలు జరిగాయి. పదిరోజుల పాటు శ్రీ వేదాంత దేశికర్ స్వామివారి 758వ వార్షిక అవతారోత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, వేదాంత దేశికర్ స్వామి వారికి ఛత్ర సహిత పల్లకి ఉత్సవం, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారికి-వేదాంత దేశికర్ స్వామివారికి పవిత్ర పినాకినీ నదీజల స్నపన తిరుమంజనం, సాయంత్రం శేష వాహనం. పేట ఉత్సవం వగైరాలు నిర్వహించారు. వేదాంతదేశికర్ దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ కేసి వరదరాజన్, నేలటూరు బాలాజీ, రాముదురై, వరదరాజన్ రమేష్, బండేపల్లి రాజగోపాల్ పర్యవేక్షణల ఆలయ అర్చకులు కిడంబి విష్ణు, శ్రీనివాస రామానుజుల పర్యవేక్షణలో ఈ ఉత్సవాలు కన్నులపండువగా జరిగాయి.

# క్యాన్సర్‌ని జయించాలి

క్యాన్సర్‌ను చూసి భయపడవద్దని, ఆత్మవిశ్వాసంతో దానిని ఎదుర్కొందామని నెల్లూరు ఇండియన్ రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. లక్ష్మీ రోగులకు ధైర్యం చెప్పారు. ఈనెల 22న 'వరల్డ్ రోజ్ డే' సందర్భంగా క్యాన్సర్ రోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేదుకు ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, క్యాన్సర్ రోగులకు వైద్య చికిత్సతో పాటు మానసికంగా అండ అవసరమని చెప్పారు. క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్న రోగులకి గులాబీ పూలు అందజేశారు. ఫిజిషియన్ డాక్టర్ వెంకట భాస్కర్, సైకాలజిస్ట్ డాక్టర్ చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ముగ్గురు మంత్రులు

## టిడ్కో కాలనీలో తొలిసారిగా దేవాలయం ప్రారంభం



శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని ప్రారంభించి పూజలలో పాల్గొన్న మంత్రులు

ఆత్మకూరు నియోజకవర్గం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో అభివృద్ధికి చిరునామాగా మారుతోంది. ఇటీవల ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి ఆనంతో పాటు, నారాయణ, పార్థసారథిలు పాల్గొన్నారు. టిడ్కో కాలనీలో మొట్టమొదటగా 75 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన శ్రీ కోదండరామస్వామివారి ఆలయాన్ని ప్రారంభించి, స్వామివారి కుంభాభిషేక వేడుకలను దర్శించుకున్నారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు..ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడ్కోవాసులకు మంచినీటి వసతి కోసం కోటి రూపాయల నుడా నిధులతో పైప్‌లైన్ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం, పెరుమాళ్లపాడు, అన్నారెడ్డిపాళెం, ముక్తాపురంలలో సుమారు 7 కోట్లతో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లకు మంత్రులు శంకుస్థాపనలు చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ప్రశాంతమ్మ



నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో వీపీఆర్ సతీమణి.. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 23న కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన 61 మంది లబ్ధిదారులకు 44 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మొత్తం 1,054మంది బాధితులకు రూ. 10.75కోట్ల లబ్ధి చేకూరిందదరు.

## అపోలో ఆసుపత్రిలో..

# అరుదైన శస్త్రచికిత్స

## ○ 700 గ్రాముల బరువుతో శిశువు : తల్లీ బిడ్డ క్షేమం



వివరాలను వెల్లడిస్తున్న అపోలో వైద్యులు

అత్యంత సంక్లిష్టమైన గర్భాశయ సమస్యతో ఉన్న మహిళకి, విజయవంతంగా శస్త్రచికిత్స చేసి, ఆమెతో పాటు..కేవలం 700 గ్రాముల బరువుతో ఆమెకి జన్మించిన నవజాత శిశువును కూడా రక్షించారు నెల్లూరు అపోలో స్పెషాలిటీ వైద్యులు. ఇటీవల అపోలో ఆసుపత్రిలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీదుర్గ, యూనిట్ హెడ్ విశ్వేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ ఆ విషయాలను విలేకర్లకు వివరించారు. సుమారు 25 వారాల గర్భంతో ఉన్న 28 ఏళ్ల మహిళ తీవ్రమైన నడుము నొప్పి, వాంతులు, ఉమ్మనీరు లీకేజ్ వంటి సమస్యలతో అపోలో హాస్పిటల్‌లో చేరారని, అయితే ఆమె గర్భాశయం పుట్టుకతోనే రెండు భాగాలుగా ఉండే అరుదైన "బైకార్నుయేట్ యుటెరస్" సమస్యతో ఉండటంతో పరిస్థితి ప్రమాదకరంగా మారిందని వారు చెప్పారు. వెంటనే శస్త్రచికిత్స నిర్వహించి కాన్పు చేసినట్లు వెల్లడించారు. ఆమెకి ఆడ శిశువు జన్మించగా, ఆ చిన్నారి బరువు కేవలం 700 గ్రాములు మాత్రమే ఉందని, వెంటనే నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స అందించామని తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం తల్లి కోలుకోగా, చిన్నారి కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడంతో, తల్లీ బిడ్డలను డిశ్చార్జ్ చేశామన్నారు. చిన్న పిల్లల వైద్యులు రాజశేఖర్‌రెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారునికి..రామ్ అభినందన



అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరుస్తూ అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధిస్తున్న వల్లిపి హిమతేజ ఇటీవల వాకాడులోని నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి నియోజకవర్గం వైఎస్ఆర్‌సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నానని, ఇంటర్మీడియట్ నుంచే స్థానిక ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తూనే క్రీడల్లో అంతర్జాతీయస్థాయిలో రెండు కాంస్య పతకాలు, జాతీయస్థాయిలో మరో 5 పతకాలు సాధించాడు. క్రీడల్లో తన ప్రతిభను గుర్తించి రామ్‌కుమార్‌రెడ్డి ఎంతో ప్రోత్సహిస్తున్నారంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి , ఆ క్రీడాకారుడిని అభినందించి, భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని ఆకాంక్షించారు.

# 27న 'వేద విజ్ఞాన వేదిక' సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో భాగంగా, 177వ ప్రసంగం 'సాహితీ విరూపాక్షుడు విద్వాన్ విశ్వం' అనే అంశంపై సాహిత్యోపన్యాసం ఉంటుందని వేదిక నిర్వాహకులు జెకె రెడ్డి, కందనూరు మధు తెలిపారు. ప్రముఖ రచయిత, జర్నలిస్టు, ధాత్రి టీవీ అధినేత పమిడికాల్వ మధుసూదన్ ప్రధాన వక్తగా పాల్గొని విద్వాన్ విశ్వం జీవితం-కవిత్వంల గురించి ఉపన్యసిస్తారని, చెన్నై టీ-నగర్‌లోని కృష్ణాహాల్ ఆంధ్రా క్లబ్‌లో 27న సాయంత్రం 6.30 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని సాహిత్యాభిమానులు తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.

# 27 నుంచి..మహాభారత ప్రవచనాలు

నెల్లూరులోని పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వచ్చే నెల 6వతేదీ వరకు ప్రముఖ సారస్వతోపన్యాసకులచే మహాభారత ప్రవచనాలు జరుగనున్నాయి. బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో ప్రతిరోజు సాయంత్రం 6నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని, 27న సభను మందిర పాలకవర్గం అధ్యక్షులు తన్నీరు మస్తాన్‌రావు ప్రారంభిస్తారని, ముఖ్యఅతిథులుగా ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. 27న అవధాని కోట రాజశేఖర్, 28న డా.ఐనవోలు శ్రీనివాస చక్రపాణి, 29న, శతావధాని కొండెపి మురళీకృష్ణ, అక్టోబరు 1న డా.కె.గిరిజాలక్ష్మి, 2న ఇనమనమెళ్లూరు నాగరాజారావు, 3న దర్భి బాలసుబ్రహ్మణ్యం, 4న డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు, 5న డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య, 6న పోలవరపు లక్ష్మీనరసింహారావు తమ ప్రవచనాలను వినిపిస్తారని, భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# తెలుగు కథ సంకలనాలు విశిష్టమైనవి



కొప్పర్తి రాంబాబు

తెలుగు భాషలో కథ సంకలనాలు ఎంతో విశిష్టమైనవని ఇండియన్ బ్యాంక్ విశ్రాంత ఏజీఎం, కొప్పర్తి కథావాహిని యూ ట్యూబ్ నిర్వాహకుడు విజయవాడకు చెందిన కొప్పర్తి రాంబాబు చెప్పారు. ఇటీవల స్థానిక చేతన సంస్థ ఆధ్వర్యంలో వర్ధమాన సమాజం హాల్‌లో జరిగిన సభలో ఆయన "తెలుగులో కథ సంకలనాలు" అనే అంశంపై ప్రసంగించారు. తొలినాటి తెలుగు కథల సంకలనాలలో ఎస్వీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహింపబడిన కళాసాగర్ సంస్థ రజతోత్సవ సంచిక "కథాసాగర్" గురించి, విశాలాంధ్ర వారి నూరేళ్ళ తెలుగు కథ, కేంద్ర సాహిత్య అకాడమీ వారి తెలుగు కథా సంకలనాలు, గొల్లపూడి మారుతీరావు 'వందేళ్ళ కథకు వందనాలు', కథా సాహితి, తానా వారి 'కథ' సంకలనాల గురించి వివరించారు. చేతన కార్యదర్శి వై.శేషగిరీశం, వీ.ఆర్. కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, బొగ్గరపు రాధాకృష్ణ, జి.సుభద్రాదేవి, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# 2.32 కోట్లతో అభివృద్ధి పనులు

## చెముడుగుంటలో బీఎంఆర్‌తో కలిసి ప్రారంభించిన సోమిరెడ్డి



అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన మహోత్సవంలో ఆటవిడుపుగా ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఎంపీ బీఎంఆర్

తమ కూటమి ప్రభుత్వ పాలనలో ఊరూరా కోట్లాదిరూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రాష్ట్ర అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీలో రూ.2.32 కోట్లతో పూర్తి చేసిన 12 అభివృద్ధి పనులకు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు(బీఎంఆర్)తో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాము కోరిన వెంటనే నక్కల గిరిజన కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి బీద మస్తాన్‌రావు రూ.30 లక్షలు మంజూరు చేశారని, ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలు ఆ కాలనీ వాసులకు బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. అదేవిధంగా, జాతీయ రహదారి నుంచి బురాన్‌పూర్ కు రూ.46 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించామని, రూ.50 లక్షలతో గంగిరెడ్డి చెరువును చక్కదిద్దే పనులు జరుగుతున్నాయన్నారు. ఒక్క చెముడుగుంట పంచాయతీలోనే రెండున్నరేళ్లలో రూ.2.32 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం సంతోషంగా ఉందన్నారు. అప్పుడూ, ఇప్పుడూ అభివృద్ధి తమతోనే జరిగిందన్నారు. బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ, సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధిలో తనను కూడా భాగస్వామిని చేసిన సోమిరెడ్డికి ధన్యవాదాలని అన్నారు. సోమిరెడ్డి కోరిన వెంటనే నక్కల కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేశానని, ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న భవనం నిర్మాణానికి మరో రూ.7.50 లక్షలు మంజూరు చేస్తానని మాట ఇచ్చానని కూడా ఆయన తెలిపారు. తొలుత గ్రామస్తులు వారికి పెద్దఎత్తున స్వాగతం పలికారు.

## కృష్ణపట్నంలో.. ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ



కృష్ణపట్నంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తు న్నానంటూ సోమిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో ఇటీవల రూ.5.65 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, రూ.4.20 కోట్లతో ఇక్కడ నిర్మించబోతున్న 33 కేవీ సబ్‌స్టేషన్‌తో కృష్ణపట్నంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిరంతర విద్యుత్ సరఫరా కానుందని తెలిపారు. కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో కృష్ణపట్నం పంచాయతీ పరిధిలో సుమారు రూ.11.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, రూ. 11.65 కోట్లతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు.

# నరేంద్రబాబుకు..'పెళ్ళకూరు' పురస్కారం



సత్కారాన్నందుకుంటున్న గుండాల నరేంద్ర

సోషల్ సర్వీస్ గ్రూప్ నెల్లూరు వారు, వారి గురువైన డాక్టర్ పెళ్లకూరు రవీంద్రరెడ్డి స్మారకార్థం ఏటా ప్రదానం చేసే పురస్కారాన్ని ఈసారి ప్రముఖ కవి, స్థానిక వెంగళరావునగర్‌లోని నగరపాలక ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబుకు బహుకరించారు. డాక్టర్ పెళ్లకూరు రవీంద్రరెడ్డి జ్ఞాపకార్థం, వారి వద్ద విద్యాభ్యాసం చేసిన కొంతమంది పూర్వ విద్యార్థులు ఈ అవార్డును ప్రదానం చేయడం విశేషం. స్థానిక టౌన్‌హాల్‌లో ఈనెల 20న జరిగిన పెళ్లకూరు రవీంద్రరెడ్డి 30వ సంస్మరణసభలో "డాక్టర్ పెళ్లకూరు రవీంద్రరెడ్డి స్మారక అత్యుత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారం-2026'తో నరేంద్రబాబును సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత నెల్లూరు మండల విద్యా శాఖాధికారులు కే.ఎస్.నరసయ్య, సిహెచ్.రమేష్‌బాబు, సోషల్ సర్వీస్ గ్రూప్ సెంట్రల్ కోఆర్డినేటర్ కె.వి.ఫణిరాజకుమార్, చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయభాస్కర్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ డి.పుల్లయ్య, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పూండ్ల రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సి.మంజులవాణి ఆయన్ను అభినందించారు.

## టూకీగా...

### రామతీర్థంలో..
### తీరప్రాంత పరిశుభ్రతా దినం

విడవలూరు మండలం రామతీర్థంలో ఈనెల 21న తీరప్రాంత పరిశుభ్రతా దినం (కోస్టల్ క్లీనప్ డే) నిర్వహించారు. తహశీల్దార్ ఏ.లక్ష్మీప్రసన్న, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకట రమణమ్మ సముద్రాన్ని కలుషితం కాకుండా కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను సముద్రంలో వేయకూడదని స్థానికులకు సూచించారు. టీడీపీ నాయకులు వాసు, చిన్నబాబు పాల్గొన్నారు.

### పొదలకూరులో హెల్మెట్ ధారణపై అవగాహన

మండలకేంద్రమైన పొదలకూరులో ఇటీవల సీఐ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ శివరాకేష్‌ల ఆధ్వర్యంలో వాహనదారులకు హెల్మెట్‌ల ధారణపై అవగాహన కలిగించారు. రోడ్డుప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, ద్విచక్రవాహనదారుల తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించాలని చెప్పారు.

### పాపిరెడ్డిపాళెంలో పోషణ మాసోత్సవం

తోటపల్లిగూడూరు మండలం పేడూరు సెక్టార్ పాపిరెడ్డిపాళెం ఎస్సీకాలనీలో ఈనెల 21న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లలితాంబ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వినియోగించే పోషకాహారం విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. వంటపాత్రలు శుభ్రంగా ఉండాలన్నారు. ఏఎన్ఎం సుప్రజ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### విడవలూరులో గురజాడ జయంతి

విడవలూరులోని పీఆర్ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ కళాశాలలో ఈనెల 21న మహాకవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలు జరిగాయి. గురజాడ దేశభక్తిని, రచనల విశిష్టతని ఉపాధ్యాయులు విద్యార్థులకి వివరించారు. తొలుత, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, వైస్‌ప్రిన్సిపాల్ మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొని గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

### తలమంచిలో పంటపొలాల పరిశీలన

ఇటీవల కురిసిన అకాలవర్షానికి కొడవలూరు మండలం తలమంచి గ్రామపరిధిలో నేలకొరిగి దెబ్బతిన్న వరిపొలాలను వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి పరిశీలించారు. పంట నష్టాలను నమోదు చేసుకుని, వారికి ప్రభుత్వం నుంచి తగు సాయం అందేలా కృషిచేస్తానని చెప్పారు.

### పొదలకూరులో పోలీసుల స్పెషల్ డ్రైవ్

పొదలకూరులో ఇటీవల పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, అతివేగం అనర్థదాయకమని వివరించారు. పొదలకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ శివరాకేష్ పాల్గొన్నారు.

### దుండిగం విద్యార్థులకు సైకిళ్ళ వితరణ

ప్రముఖ పారిశ్రామికవేత్త, దగదర్తి ఎంపీపీ తాళ్ళూరి ప్రసాద్‌నాయుడు ఇటీవల దగదర్తి మండలం దుండిగం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళను పంపిణీ చేశారు. తాళ్ళూరి రమణయ్యనాయుడు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంఇఓలు భాస్కర్, విజయరత్నం, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### దమ్మాయిపాళెంలో ఆయుర్వేదంపై అవగాహన

ముత్తుకూరు మండలం దమ్మాయిపాళెం ఆయుర్వేద కేంద్రంలో ఈనెల 23న ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కలిగించారు. 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుర్వేద వైద్యులు జీవీ చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయుర్వేద మందుల విశిష్టతను వాటి ఉపయోగాలను రోగులకు వివరించారు.

### పాతనాపురంలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

కలిగిరి మండలం పాతనాపురం గ్రామంలో పేకాటాడుతున్న అయిదుగురిని కలిగిరి ఎస్ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10,190 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.



అభివృద్ధి పనులకి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి తదితరులు

## నెల్లూరు కార్పొరేషన్‌లో..
# 240 కోట్లతో అభివృద్ధి పనులు

నెల్లూరుజిల్లా చరిత్రలోనే ఎప్పుడూ లేనివిధంగా నగరంలోని మైపాడు గేట్ సెంటర్‌లో ఉన్న డిజిపి కళ్యాణ మండపంలో నగరపాలక సంస్థ మరియు మున్సిపాలిటీల పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమం ఇటీవల పెద్దఎత్తున జరిగింది. సభారంభంలో వేదికపై ఉన్న ప్రజాప్రతినిధులు మరియు నాయకులు నగరాభివృద్ధికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా జిల్లావ్యాప్తంగా 380 కోట్ల అంచనా వ్యయంతో 62 అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరగ్గా, అందులో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మంజూరైన 240 కోట్ల విలువైన 24 అభివృద్ధి పనులకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మేయర్ సుజాత, కార్పొరేషన్ కమిషనర్ నందన్ శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో పట్టణ ప్రాంతాల్లో రహదారులు, సెంట్రల్ మీడియన్స్, సెంట్రల్ లైటింగ్, పార్కులు తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. అదేవిధంగా, జిల్లాలోని కావలి మున్సిపాలిటీ పరిధిలో 8పనులకు 40కోట్లు, గూడూరు మున్సిపాలిటీలో 12 పనులకు 30కోట్లు, ఆత్మకూరు మున్సిపాలిటీలో 6 పనులకు 29 కోట్లు, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీలో 5 పనులకు 22 కోట్లు, అల్లూరు నగర పంచాయతీ పరిధిలో 7పనులకు 19 కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మంజూరైన 8,000 కోట్ల హామ్ పనులకు కుప్పం నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. విశాఖపట్నం నుంచి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రసంగించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు మామిడాల మధు, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా మీ మాటలే!.. వాడవాడలా మీ పాటలే!..
# కారణజన్ముడు!



***భారతీయ సినిమా గాయకులు, భరతమాత ముద్దుబిడ్డ, నెల్లూరు గానాలపట్టి.. శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) భౌతికంగా మనకు దూరమై ఆరేళ్ళు. ఈనెల 25న ఆయన 6వ వర్ధంతి. ప్రపంచప్రఖ్యాతి చెందిన గానగంధర్వుడు లేకుండానే ఆరేళ్ళు ఇట్టే గడిచిపోయాయంటే నమ్మబుద్ధి కావడం లేదు. అయినా, ఆయన మనకు కనిపించడం లేదన్న మాటేగానీ, ఆయన లేనిదెక్కడ?..మన హృదయపీఠాల్లో శాశ్వతంగా నిలిచే ఉన్నారు కదా!..***

ఇటీవల జరిగిన వినాయకచవితి వేడుకల్లో ఏ మండపంలో విన్నా.. ఏ మందిరంలో విన్నా ఆయన పాడిన పాటలే!.. 'జై గణేశా!.. జై జై గణేశా'..అని ఆయన అంటుంటేనే భక్తాదులందరికీ పూనకం వచ్చినట్లుంటుంది. వినాయకుని స్తోత్రాలు వింటే బాలూ గొంతులోనే వినాలి అన్నట్లుగా ఉంటాయి. ఆ గొంతులో ఎంత మాధుర్యమో చెప్పలేం. ఆ మధుర స్వరం.. ఆయనకు దేవుడిచ్చిన వరం. తన పాటలు పాడించుకోవడానికి ఆ దేవుడే బాలూకి ఆ స్వరమిచ్చాడేమో!.. ఆయన పాటలే కాదు.. మాటలు కూడా ఆణిముత్యాలే!.. ప్రతిమాటా భావితరాల వారికి ఒక వెలుగు బాటగా ఉంటుంది..'పాడుతా..తీయగా' అంటూ..వర్ధమాన గాయకులకు ఎన్నో మార్గదర్శకాలు చేసిన అపార సంగీతజ్ఞులాయన. ఆయన జ్ఞాపకశక్తి అమోఘం!.. ఎప్పటెప్పటి సంఘటనలనో కళ్ళకి కట్టినట్లు చెప్పగలగడం ఆయన ప్రత్యేకత.

ఒక్క తెలుగుభాషలోనే కాదు, తమిళం, కన్నడం, హిందీ లాంటి 11 భారతీయ భాషల్లో.. దాదాపు నలభైవేలకి పైగానే పాటలు పాడడం ఒక్క బాలూకే చెల్లింది. 1966లో తొలిసారిగా ప్రముఖ హాస్య నటుడు పద్మనాభం నిర్మించిన 'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న' చిత్రం ద్వారా సినీ గాయకునిగా.. పాటల బాటసారిగా తన ప్రస్థానం ప్రారంభించి, తన ప్రతిభా పాటవాలతో.. పాటలనే బాటలుగా చేసుకుంటూ జాతీయస్థాయికీ.. అంతర్జాతీయ స్థాయికి కూడా ఎదిగారు.

భక్తిగీతం పాడినా.. దేశభక్తి గీతం ఆలపించినా.. ఇంకేవైనా ప్రేమగీతాలు.. విరహగీతాలు, విషాదగీతాలు ఆయన నోటి నుండి వినిపించినా.. ప్రేక్షకులు లేదా శ్రోతలు అలా.. మంత్రముగ్ధులై పోవలసిందే. పాటకి ఎంత మహత్తు ఉందో.. బాలూ పాట వింటే తెలుస్తుంది. అందుకే ప్రభుత్వాలు సైతం ఆయనకు అనేక విశిష్టమైన అవార్డులను బహుకరించి తమను తాము గౌరవించుకున్నాయి. తమిళ, కన్నడ ప్రభుత్వాలు జాతీయ పురస్కారాలు ఇచ్చి సత్కరించాయి. ఒక్క నంది అవార్డు వచ్చినా చాలు..జీవితం ధన్యం అనుకుంటాం కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఏకంగా 25సార్లు 'నంది' అవార్డులు అందుకున్న బాలు ఘనతను చాటడానికి మన భాష చాలుతుందా? కేంద్రప్రభుత్వం నుంచి కూడా ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులు కూడా ఆయనకు లభించాయంటే అంత కన్నా గొప్ప గౌరవాలింకేమి ఉంటాయి?.. ప్రత్యేకించి తెలుగు జాతికి, తెలుగు భాషకి, తెలుగు పాటకి హిమాలయమంత గొప్ప కీర్తి తెచ్చిన బాలూ.. మనవాడు కావడం నెల్లూరీయుల కెంత గర్వకారణమో కదా!.. అయినా, ఒక చిన్న కొరత ఉండనే ఉంది. 'బాలూకి భారతరత్న' కూడా వస్తే ఎంత బాగుం టుందోనని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానగణమంతా ఆశగా ఎదురుచూస్తూనే ఉంది. 'కదలి రాద తనే వసంతం'.. అని ఓ సినిమాలో ఆయనే పాడినట్లుగా.. 'వనం చెంతకి.. వసంతం రాకుండా ఉంటుందా!'.. త్వరలో ఆ కోరిక కూడా నెరవేరుతుందని ఆశిద్దాం! ఏదేమైనా తన మధురగానంతో అశేషప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన.. ఆ మహోన్నత గాయకునికి... ఆ కారణజన్ముడికి.. ఇవే మా అక్షర నివాళులు!

**(సెప్టెంబరు 25.. బాలూ వర్ధంతి)**






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com